
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 5 నవంబరు 2024

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్డీసీ రా మసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను ఎప్పటికప్పుడు వేగవంతం గా పరిష్కరించాలని, సమస్య వచ్చిన మరుసటి రోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాలన్నారు. అర్జీదారులతో కలిసి ఫోటో దిగాలి. సమస్యను విచారణ చేయాలి. ఏదైనా నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉంటే నోటీసు ఇచ్చి గడువు తర్వాత ఆ సమస్య తమ పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరి ష్కరించాలని సూచించారు. ఒకవేళ పై స్థాయికి వెళ్లాల్సి ఉంటే ఆ విషయాన్ని అర్జీదారుకు స్పష్టంగా వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలు బీయాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల గురించి మండల తహసీల్దార్లతో సమీక్షించారు. సీఎం కార్యాలయం నుంచి అందిన దరఖాస్తుల్లో మూడు రోజుల్లోపు పరిష్కరించాల్సినవి ఇంకనూ 47 దరఖాస్తులు ఉన్నాయని, ఇందుకు గల కారణాలను ఆయా మండల తహసీల్దార్లను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అపార్ యూనిక్ ఐడీ కోసం ప్రత్యేక సెంటర్లు

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా జిల్లాలో అపార్ యూనిక్ ఐడీ కోసం ఆధార్ సెంటరులో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలు నందు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీలకు స్పెషల్ జూమ్ వీసీ ద్వారా అపార్ యూనిక్ ఐడీ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో చదివే పిల్లలందరికీ ఒకే ఐడీ వుండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల వివరాలు అపార్ యూనిక్ ఐడీలో చేరుస్తామన్నారు. ఇందుకోసం పట్టణాల్లో, మున్సిపాల్టీల్లో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

మదనపల్లెలో హీరో కిరణ్ అబ్బవరం సందడి

మదనపల్లె అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో సోమవారం సినీ హీరో కిరణ్ అబ్బవరం సందడి చేశారు. ఇటీవల విడుదలైన 'క' సినిమా విజయోత్సవ వేడుకల్లో భాగంగా ఆయన మదనపల్లెకు విచ్చేశారు. అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సినీ హీరోకు స్వాగతం పలికారు. స్థానిక థియేటర్ వద్ద అభిమానులు కోలాహలం చేశారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణం కలిగిన మదనపల్లెకు రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గత నాలుగేళ్లుగా అన్నార్థులకు ఆకలి తీరుస్తున్న హెల్పింగ్ మైండ్ ఫుడ్‌బ్యాంకును సందర్శించారు. అన్నార్థులను అక్కున చేర్చుకుని వారికి ఆకలి తీరుస్తున్న సభ్యుల సేవలను కొనియాడారు. అభిమానులతో కలిసి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



హెల్పింగ్ ఫుడ్‌బ్యాంకును సందర్శించిన సినీ హీరో కిరణ్ అబ్బవరం

దయనీయ స్థితి నుంచి.. డైరెక్టర్

- పోరంబోకు అనుకున్న చోటే..
- ఊరందరిచేతా ప్రశంసలు
- తెలుగుతో పాటు తమిళం, కన్నడ సినిమాలకు దర్శకత్వం


6



వైసీపీ పాపం.. ఆయకట్టుకు శాపం

- పింఛా ప్రాజెక్టును గాలికి వదిలేసిన జగన్ ప్రభుత్వం
- దీనస్థితిలో కాలువలు
- భారీగా నీరు వృథా
- తుప్పు పట్టిన ప్రధాన గేట్లు


జగన్ సర్కార్ చేసిన పాపం.. రైతులకు శాపంగా మారింది. ప్రాజెక్టు, చెరువులు, కుంటలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పింఛా ప్రాజెక్టు కాలువలను పూర్తి చేయకుండా గాలికొదిలేయడంతో ప్రాజెక్టులో నీరున్నా.. పంటలు పండించుకోలేని దుస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే కరువుతో అల్లాడుతున్న రైతన్నకు నాలుగేళ్లుగా ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగంగా మారింది. కాలువలు దీనావస్థకు చేరుకోవడంతో పాటు ప్రాజెక్టులోని నీరు భారీగా వృథా అవుతోంది. కూటమి ప్రభుత్వంలో అయినా ఈ కాలువలకు మోక్షం కలిగేనా అని పలువురు ఎదురుచూస్తున్నారు.




పింఛా ప్రాజెక్టు



ప్రాజెక్టులో 100 ఎస్టీఎంసీలు నీరు చేరిన దృశ్యం







సుండుపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసింది. యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టులో 100 ఎఫ్‌టీఎంసీలు నీరున్నా పంటలు పండించుకోలేని దుస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే కరువు గత నాలుగేళ్లుగా ప్రాజెక్టు ఉన్నా నిరుపయోగంగా మారింది. ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2020 సంవత్సరం నవంబరు 26న నివర్ తుఫాన్ కారణంగా ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోయింది. ఈ పనులు సకాలంలో చేయకపోవడం వలన సాగునీటి కొరత మరింత తీవ్రంగా మారింది. 2023 సంవత్సరం మార్చిలో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. దాదాపు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ కాలువ పనులకు మోక్షం లేదు. గత ఐదేళ్ల ప్రాజెక్టు దిగువ భాగంలోని కుడి, ఎడమ కాలువలను పట్టించుకోకపోవడం వలన దీనస్థితిలో చేరుకున్నాయి. గత ప్రభుత్వం ప్రాజెక్టు, చెరువులు, కుంటలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేశారు. ఎడమ కాలువకు అక్కడక్కడ గండ్లు పడి నీరు వృథాగా పోతోంది. కుర్వపల్లి, ముడుంపాడు మధ్యలో ఎడమ కాలువకు ఇరువైపులా కట్టిన రక్షణ గోడ రెండు చోట్ల కూలిపోవడం వలన సుమారు 18 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. అలాగే బత్రాజుగారిపల్లె సమీపంలోని ఎడమ కాలువ గండిపడి భారీగా నీరు వృథా అయింది. దీంతో స్థానిక రైతులు ఇసుక బస్తాలు, మట్టి బస్తాలు, గడ్డి వేసి నీటిని కొంత వరకు వృథా కాకుండా తాత్కాలికంగా ఆపగలిగారు. కుడి, ఎడమ కాలువల్లో చెత్తాచెదారం చేరి చివరి ఆయకట్టు రైతుకు సాగునీరు అందడం లేదు. ప్రాజెక్టు నుంచి కుడికాలువ 7, 8 కి.మీ., ఎడమ కాలువ 9 కి.మీ., ప్రవహిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సగం కూడా నీరు లేకపోవడం.. ఉన్న నీరు రైతులకు అందక వృథా కావడంతో రైతులను ఆందోళన కలిగిస్తోంది. నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

గేట్లే ప్రధాన సమస్య

గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రాజెక్టుకు ప్రధాన గేట్ల సమస్య వేధిస్తోంది. పింఛా ప్రాజెక్టు గేట్లు ఎప్పుడు మరమ్మతులు చేస్తారో అర్థం కావడం లేదు. ప్రాజెక్టుకు 3 ప్రధాన గేట్లు, 2 పూడిక గేట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రాజెక్టు నిండినప్పుడల్లా గేట్ల సమస్యలు తలెత్తుతున్నాయి. పది రోజులు ముందు కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి అరకొరగా నీరు చేరింది. ప్రాజెక్టులో ఉన్న నీరు గేట్లు సరిగ్గా లేకపోవడం వల్ల నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 0.327 ఎఫ్‌టీఎంసీలు కలదు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు సుమారు 3773 ఎకరాలు కాగా, ఈ ప్రాజెక్టు గుండా రెండు ప్రధాన కాలువలు కలవు. కుడికాలువ కింద 2211.41 ఎకరాలు ఆయకట్టు ఉంది. 17 తూములు కలవు. అలాగే ఎడమ కాలువ కింద 1562 ఎకరాల ఆయకట్టు భూమికి అధికారికంగా 14 తూముల ద్వారా పంటలకు నీరందివ్వడం జరుగుతుంది. అనధికారికంగా మరికొన్ని తూములు ఉన్నాయి. ప్రాజెక్టు ప్రధాన గేట్లతో పాటు కుడి, ఎడమ కాలువల తూముల మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రధాన కాలువల నుంచి పిల్లకాలువలకు నీరు అందించే తూముల గేట్లు కూడా లేవు. ప్రాజెక్టు దిగువ భాగంలో రైతులకు మేలు జరగాలంటే కాలువల మరమ్మతులు చేయాల్సి ఉంది.

ప్రాజెక్టుకు సిబ్బంది కొరత

ప్రాజెక్టును నిర్మించిన సమయంలో ఒక ఏఈతో పాటు, ముగ్గురు వర్క్ఇన్‌స్పెక్టర్లు, 10 మంది లస్కర్లు, ఒక ఎలక్ట్రీషియన్, ఒక ఫిట్టర్, ఒక వాచ్‌మెన్ ఉండేవారు. ప్రస్తుతం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తప్ప ఇంకెవ్వరూ లేరు. ఫిట్టర్ కూడా ప్రస్తుతం లేదు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటే కాలువల దుస్థితి తెలుసుకొని చివరి ఆయకట్టుకు నీటిని చేర్చవచ్చు. నిత్యం కాలువలో పిచ్చిమొక్కలు, జమ్ము, చెత్తాచెదారం పేరుకుపోతోంది. రెండు ప్రధాన కాలువలకు, వందలాది మంది రైతులకు సాగునీటిని అందించే వీలున్నా సిబ్బంది కొరత, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



తక్షణమే నీటి వృథా అరికట్టాలి..

తక్షణమే నీటి వృథాను అరికట్టాలి. లేకపోతే పంటల సాగు చేసిన రైతులకు సాగునీరు కొరత ఏర్పడి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఎడమ కాలువలో పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. కాలువలకు గండిపడింది. భారీగా నీరు వృథా అవుతోంది. ప్రాజెక్టులో అరకొరగా నీరు ఉంది. వీటిని వృథా కాకుండా కాపాడాలి.

- సిద్దవటం వెంకట్రమణ, రైతు

సిబ్బంది కొరత ఉంది..

ప్రాజెక్టుకు సిబ్బంది కొరత ఉంది. కుడి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాం. ఎడమ కాలువకు పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు రావడంతో నాలుగు సంవత్సరాల తర్వాత రైతులకు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నాం. నీటి వృథాను అరికట్టేందుకు కృషి చేస్తున్నాం.


- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు



శివాలయాల్లో కార్తీక శోభ

● లయకారుడి సేవలో భక్తులు

సిద్దవటం/కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచే లయకారుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు సాయంత్రం పెద్దఎత్తున ఆలయాలను సందర్శించి అత్యంత భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లాలోని రాయచోటి వీరభద్రాలయం, సిద్దవటం మండలంలోని నిత్యపూజకోన, రాజంపేట అత్తిరాల, కలికిరి సోమేశ్వర స్వామి ఆలయం, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె తదితర ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. ఇక లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజ కోనకు భక్తులు పోటెత్తారు. వృద్ధులు, మహిళలు, యువకులు, పంచలింగాల వద్ద నుంచి కాలిబాటన నడుచు కుంటూ శివపార్వతులను దర్శనం చేసుకున్నారు.



నిత్యపూజకోన జలపాతాల మధ్య స్నానం చేస్తున్న భక్తులు



కలికిరి సోమేశ్వర ఆలయంలో..



నిత్యపూజకోనకు తరలివస్తున్న భక్తులు

ఉచిత సిలిండర్లపై గందరగోళం

- మొదటి సిలిండరుకు మార్చి వరకూ గడువు
- పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే
- కుటుంబంలో ఒక్క కనెక్షన్‌కు మాత్రమే అర్హత
- కేవైసీ మాత్రం తప్పనిసరి

6



హంద్రీ-నీవా విస్తరణ పనులు రద్దు

- కాంక్రీట్ లైనింగ్ పనులకే ప్రభుత్వం మొగ్గు
- ప్రారంభం కాకుండానే రూ.1219 కోట్ల పనులు నిలుపుదల
- ఇదీ పుంగనూరు బ్రాంచి కెనాల్ దుస్థితి

లైనింగ్ చేయనున్న హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్



మదనపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవాలో ప్రధానమైన పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణ పనులు రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి ఏడాదిన్నర కాలం గడిచినా పనులు ప్రారంభించలేదు.. పైసా పని చేయలేదు. దీంతో గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పై నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రివర్స్ టెండరింగ్ విధానంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) రూ.1219 కోట్లతో దక్కించుకున్న పనులను రద్దు చేసి, వాటి స్థానంలో యథావిధిగా కాంక్రీట్ లైనింగ్ పనులు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హంద్రీ-నీవా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొదటి, రెండోవిడతలో చేపట్టిన హంద్రీ-నీవా ప్రధాన కాలువ పనులతో పాటు పుంగనూరు, కుప్పం బ్రాంచి పనులను విడతల వారీగా చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆ శాఖాధికారులు డీపీఆర్‌లు, అంచనాలు తయారు చేయడంలో బిజీబిజీగా ఉన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాలను సస్యశ్యామలం చేయడానికి కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి ప్రభుత్వం రెండు విడతలల్లో విస్తరణ పనులు చేపట్టాలని అప్పటి జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మొదటి విడత కర్నూలు, అనంతపురం జిల్లాలలో ప్రధాన కాలువ పనులు, రెండోవిడతలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా వరకూ పనులు చేపట్టడానికి 2022 నవంబరులో టెండర్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా రివర్స్ టెండరింగ్ విధానంలో రూ.1219 కోట్లతో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) పనులు దక్కించుకుంది. ఈ పనుల కోసం అప్పట్లో ఎన్‌సీసీతో పాటు మెగా కన్‌స్ట్రక్షన్ కంపెనీలు పోటీ పడగా చివరకు ఎన్‌సీసీ దక్కించుకుంది. మూడేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలనే నిబంధన ఉన్నా అసలు ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. దీంతో కూటమి ప్రభుత్వం ఆ పనులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. విస్తరణ పనులు, అందులోనూ ఇప్పుడున్న కాలువ రెండింతలు పెంచాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. సాధారణంగా విస్తరణ పనులు అంటే ఆషామాషీ కాదు. భూసేకరణ, పరిహారం, రైల్వే, నేషనల్ హైవే క్రాసింగ్‌లు, కొండలు, గుట్టలు, వంకలు, వాగులు దాటే ప్రయత్నంలో కాంక్రీటు నిర్మాణాలు, పెద్ద పెద్ద బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. ఇదంతా కాలంతో పాటు వ్యయప్రయాసలతో కూడుకున్న పని. వీటన్నింటికీ అన్ని అనుమతులు పొంది పనులు పూర్తి చేయాలంటే కనీసం మరో పదేళ్ల పట్టే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పైగా ఆ విస్తరణ పనులు చేసినా మెయిన్ కెనాల్‌తో పాటు బ్రాంచీ కెనాల్స్ కూడా కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టాల్సిందే. దీన్ని దృష్టిలో పెట్టుకుని కాలువలు వెడల్పు చేయడం కంటే ఉన్న వాటినే పూర్తిస్థాయిలో అడ్డంకులు క్లియర్ చేసి లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అటు శ్రీశైలం నుంచి అయినా, ఇటు జీడీపల్లె రిజర్వాయర్ నుంచి అయినా నీటిని తీసుకుంటే వందశాతంలో 60 శాతానికి మించీ గమ్యానికి చేరడం లేదు. సరఫరాలో నష్టాలు, ఆవిరి రూపంలో నష్టాన్ని అంచనా వేశారు. అది ప్రస్తుతం ఉన్న కాలువల పరిమాణంలో అయినా, వెడల్పు చేసినా ఇదే పరిస్థితి ఉంటుంది. అయితే ఇప్పుడున్న కాలువలు తవ్వడానికే పదేళ్ల పట్టింది. దీనికి రెట్టింపు పరిమాణంలో కాలువలు తవ్వి లిఫ్టులు ఏర్పాటు చేయడం, కాంక్రీటు నిర్మాణాలు చేపట్టాలంటే అంతకంటే మరింత ఎక్కువ సమయం పట్టే అవకాశాన్ని పరిగణలోకి తీసుకున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఉన్న వాటిలోనే పూర్తిస్థాయిలో నీరు ప్రవహించేలా కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టడానికే మొగ్గు చూపారు. ఇందులోభాగంగా ప్రధాన కాలువ మొదలయ్యే కర్నూలు జిల్లా శ్రీశైలం, అనంతపురం, రెండో విడతగా పుంగనూరు బ్రాంచీ, ఆ తర్వాత కుప్పం బ్రాంచీకెనాల్ పనులు చేపట్టాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు.

హంద్రీ-నీవా రెండో దశ పనులు పూర్తయి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఇప్పటి వరకు కృష్ణాజలాలు నాలుగుసార్లు వచ్చినా పూర్తిస్థాయిలో ప్రవహించలేదు. కృష్ణా జలాలు ఉమ్మడి జిల్లాకు 10 టీఎంసీలు వాటా ఉన్నా ఇప్పటికీ సీజన్ వారీగా తీసుకుంటే 1.60 టీఎంసీలకు మించీ రాలేదు. ముఖ్యంగా కర్నూలు జిల్లా శ్రీశైలం నుంచి వస్తున్న కృష్ణా జలాలు అనంతపురం జిల్లా దాటి రావడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, దానికితోడు వరదల సమయం 120 రోజుల నుంచి 60 రోజులకు తగ్గిపోవడం, ఆ సమయంలో మన వాటా నీటిని తీసుకోలేకపోవడం తదితర కారణాలు ఉన్నాయి. చెర్లోపల్లె రిజర్వాయర్ దాటి వచ్చినా మధ్యలో రైతులు నీటిని దారి మళ్లించడం, కాలువకు గండ్లు పెట్టడం, అప్పటికే చెరువులు, కుంటలు నిండినా మార్గమధ్యలో అక్కడి రైతులు మరోసారి నింపుకోవడం, తదితర కారణాలతో కృష్ణమ్మ నడకకు తరచూ బ్రేక్ పడుతోంది. ఈ క్రమంలో జగన్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించింది. ఇందులో భాగంగా గాలేరు-నగరి ప్రాజెక్టు నుంచి తీసుకుంటున్న కృష్ణా నీటిని మధ్యలో కడప జిల్లా గండికోట నుంచి రూ.4500 కోట్లతో పైపులైన్ ద్వారా హంద్రీ-నీవాకు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి పుంగనూరు బ్రాంచీ కెనాల్ మొదలయ్యే కదిరి మండలం పట్నం వద్ద 79.60 కి.మీ నుంచి పలమనేరు నియోజకవర్గం గంగవరం వద్ద 220.35 కి.మి.వరకూ కాలువ వెడల్పునకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో కాలువ వెంబడి స్ట్రక్చర్లు, లిఫ్టులు, పంప్‌హౌస్‌లు, అండర్ పాసేజ్, తదితర పనులు ఉన్నాయి.

పుంగనూరు బ్రాంచి కెనాల్‌లో ఇప్పటికే 380 క్యూసెక్కులు నీరు ప్రవహించే సామర్థ్యం ఉండగా, దాన్ని దాదాపు 1180 క్యూసెక్కులకు పెంచేలా డిజైన్ చేశారు. అంటే నీటితో పాటు లిఫ్టులు, పంపులు, ఇతర నిర్మాణాలను మూడురెట్లు పెంచాలని నిర్ణయించారు. అలాగే కాలువ వెంబడి అటు, ఇటు విస్తరణకు భూసేకరణ కూడా చేపట్టాల్సి ఉంది. ఇదిలా వుండగా, కాలువల సామర్థ్యం పెంచడం ద్వారా అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గంలోని సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నది ఉద్దేశ్యం. ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గంలోని చెరువులు నింపడం, కొత్తగా చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పాటు చెరువులను కలుపుతూ లింకు చానల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇదిలా వుండగా, అయిదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ఈ పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. చేసిన పనులకు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ హంద్రీ-నీవా పనులు చేపట్టలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

దయనీయ స్థితి నుంచి.. డైరెక్టర్



- పోరంబోకు అనుకున్న చోటే..
- ఊరందరిచేతా ప్రశంసలు
- తెలుగుతో పాటు తమిళం, కన్నడ సినిమాలకు దర్శకత్వం


డైరెక్టర్ శ్రీనివాస్

రామసముద్రం, నవంబరు 4: చిన్నతనంలోనే సినిమాలపై మోజుతో బడి ఎగ్గొట్టేవాడు. దర్శకుడు కావాలని కలలు కనేవాడు. కూలిపనులతో జీవనం సాగించే కుటుంబం కావడంతో.. బతక డానికి ముద్ద దొరకని దయనీయ స్థితి అయినా.. మొండిగా ముందుకెళ్లి ముళ్లబాటను పూలబాటగా మార్చుకున్నాడు. పోరం బోకు అని ముద్రపడ్డ ఊరిలోనే.. అందరి చేతా ప్రశంసలు అందుకున్నాడు. ఆయనే సినిమా డైరెక్టర్ శ్రీనివాస్. ఇందుకు సంబంధించి వివరాలు శ్రీనివాస్ మాట ల్లోనే..

బడి ఎగ్గొట్టి సినిమాలకు..

రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీలో కూలి పనులు చేస్తూ జీవనం సాగించే నాగమ్మ, గెవప్ప దంపతులకు నలుగురు కుమారులు. అందులో నేను నాలుగవ వాడిని. నాకు చిన్నతనం నుంచి సినిమాలంటే మక్కువ ఎక్కువ. ఊరిలో ప్రాథమిక విద్య అయిన తర్వాత రామసముద్రం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేరాను. అయితే సినిమాల మోజుతో క్లాసులు ఎగ్గొట్టి మండల కేంద్రం లోనే ఉన్న థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవాన్ని. ఇది గమనించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నన్ను పలుమార్లు మందలించారు.

ఇంట్లో చెప్పకుండా చెన్నై..

బడికి వెళ్లడం చదువుకోవడం నాకు కష్టంగా ఉండేది. ఎంతసేపూ సినిమాలే.. దీంతో ఇక చదువు వద్దనుకుని తొమ్మిదవ తరగతి చదువుతున్న సమయం లోనే తల్లిదండ్రులకు తెలియకుండా చెన్నై వెళ్లిపోయాను. చేతిలో చిల్లిగవ్వ లేని స్థితి. రోడ్డుపక్క పడుకునే వాడిని. ఏది దొరికితే అది తినేవాడిని. సినిమా ఇండస్ట్రీపై మోజుతో ఎన్నో తిండిలేని నిద్రలేని రాత్రులు గడిపాను. బతకడానికి చిన్నాచితక పనులు చేసుకుంటూ.. సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగేవాడిని. ఇంత దయనీయ స్థితిలోనూ చెన్నైలోని అడియార్‌లో డిప్లమా ఇన్ ఫిల్మ్ టెక్నాలజీ పూర్తి చేశారు. అది నా కల సాకారానికి, పురోగతికి పునాదిరాయిగా మారింది. డిప్లమా పూర్తి అయిన తర్వాత జన్మనక్షత్రం సినిమాకు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసినందుకు ఐదువందల రూపాయల పారితోషకం ఇచ్చారు. ఇదే నా మొదటి పారితోషికం.

మొదటి సినీ గురువు తక్కాలి శ్రీనివాసన్..

డిప్లమా పూర్తి చేసిన తర్వాత తమిళ డైరెక్టర్ తక్కాలి శ్రీనివాసన్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. శ్రీనివాసన్ డైరెక్షన్‌లో అప్పటికే 499 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న అగ్ని సీరియల్‌కు 500 ఎపిసోడ్‌కు నేను మొదటిసారి డైరెక్టర్‌గా వ్యవహరించాను. ఇందుకుగాను నాకు రూ.50వేలు పారితోషకం ఇచ్చారు.

పోరంబోకు డైరెక్టర్‌గా..

తమిళంతో పాటు తెలుగులో చాలా సినిమాలకు పనిచేశాను. తెలుగులో కొన్ని హిట్ సినిమాలకు కథా సహకారం అందించాను. తెలుగులో మొట్టమొదట పోరంబోకు సినిమాకు డైరెక్టర్‌గా పనిచేశాను. ఆ తర్వాత వరుసగా నిను చూడక నేనుండలేను, భూతం సినిమాలకు డైరెక్షన్ చేశాను. తమిళంలో లొడుకు పాండి, కన్నడంలో కరోడపతి సినిమాలకు దర్శకత్వం వహించాను. ఇప్పుడు ఊరికొక్కడు సినిమా షూటింగ్ పూర్తి అయి విడుదలకు సిద్ధమవుతోంది.


పోరంబోకు సినిమా షూటింగ్‌లో డైరెక్టర్ శ్రీనివాస్

సేవా కార్యక్రమాలలో శ్రీనివాస్

సినిమా డైరెక్టర్ శ్రీనివాస్ సొంత ఊరికి వచ్చినప్పుడు.. ఊరిలో పారిశుధ్యం పనులు స్వయంగా చేపట్టి అందరికి ఆదర్శంగా ఉంటున్నారు. అలాగే గ్రామ ప్రజల ఆరాధ్య దైవం అయిన గెవితిమ్మరాయస్వామి వారి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులతో కలిసి తన వంతు కృషి చేస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ పనైనా సాధించవచ్చని.. ఇందుకు శ్రీనివాస్ నిదర్శనం అని గ్రామస్తుల నుంచి అభినందనలు పొందుతున్నారు.


నిను చూడక నేనుండలేను సినిమా షూటింగ్ చేస్తున్న శ్రీనివాస్


లొడుకు పాండి సినిమా షూటింగ్‌లో..

గంజాయి విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

- 5.7 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణమోహన్


వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.. సోమవారం రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. గత నెల 26న రాయచోటి పట్టణంలోని నాయబ్‌సాబ్ వీధికి చెందిన షేక్.జమాల్ బాషా అలియాస్ జమాలుల్లాను అరెస్టు చేసి అతనినుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితులుగా ఉన్న షేక్. మహబూబ్‌జాన్, షేక్. అమ్మాజీ, షేక్.ఫక్రున్నీసాతోపాటు, అనంతపురం పట్టణం ఇందిరానగర్‌కు చెందిన రహమత్‌జాన్, షేక్ సోనూను స్థానిక బండ్లపెంట దివానా సాహెబ్ దర్గా సమీపంలో అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో షేక్ మహబూబ్‌జాన్, రహమత్‌జాన్ అలియాస్ హాజీ రహంతుల్లా ఒక తల్లి పిల్లలని తెలిపారు. షేక్.రహమత్‌జాన్ ఆమె కుమార్తె సోనూ కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి కిలో రూ.13 వేలతో కొనుగోలు చేసి గంజాయి తెప్పిం చుకొని ఒక కేజీ గంజాయి రూ.13 వేలు చొప్పున కొనుగోలు చేసి మిగిలిన వారికి రూ.15 వేలకు విక్రయించేవారని తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంతో పాటు, గంజాయిని రికవరీ చేయడంలో చొరవ చూపిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ ఇన్‌చార్జి రవిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలి : పీడీ



జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపర్చాలని మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో రాజంపేట, మదనపల్లె, రాయచోటి పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మెప్మా సిబ్బందికి, రీసోర్స్‌పర్సన్ లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అప్పులు, పొదుపు వివరాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమాచారాన్ని అందులో పొందుపరుస్తారన్నారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేలా ఆర్థిక ప్రణాళికలను తయారు చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి నెల మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో టీఈలు, సీఎంఎంఎస్‌లు, సీవోలు, డీఈవో, డీఆర్‌పీ, టీఎల్ఎఫ్ ఆర్‌పీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి


మృతుడు కోళ్ల రెడ్డెప్ప

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు నడపడంలో అతి వేగం, పూర్తి అజాగ్రత్త, రాంగ్ రూట్ డ్రైవింగ్ కారణంగా ఒక వ్యక్తి మృత్యువు పాలయ్యాడు. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కొత్తగజ్జలవారి పల్లె సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకిపురం గండబోయన పల్లె పంచాయతీ కొండకింద మేకలవారిపల్లె గ్రామానికి చెందిన కోళ్ళ రెడ్డెప్ప (40) ఆవుల కొనుగోలు నిమిత్తం ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి కలకడకు బయలుదేరాడు. వేకువ జామున 4.15 గంటల ప్రాంతంలో మండలంలోని కొత్తగజ్జలవారిపల్లె సమీపం లోకి రాగానే ఎదురుగా కలకడ వైపు నుంచి వస్తున్న ఫోర్డ్ ఫియాగో కారు అతి వేగంగా రెడ్డెప్ప మోటారు సైకిలును ఢీకొట్టింది. దీంతో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు పూర్తి అజాగ్రత్తగా, రాంగ్ సైడ్ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడని సీఐ వివరించారు. సుండుపల్లెకు చెందిన రవీంద్ర నాయుడు ఈ కారును నడుపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే మృతుని భార్య కోళ్ల మమత బంధువులతో కలిసి రెడ్డెప్పను కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రెడ్డెప్పకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీఐ ఆదేశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


మృతి చెందిన చిన్నరాముడు

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన తుపాకుల చిన్నరాముడు(45)గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక నీటిలో మునిపోయాడు. అక్కడే వున్న గ్రామస్థులు రాముడు నీటిలో మునిగిపోవడం గమనించి కుంటుంబ సభ్యలకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు చెరువులోకి దూకి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడు భార్య జయమ్మ పిర్యాదు మేరకు పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్‌లు


అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌నాయుడు, జాబీర్, హరిప్రసాద్

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజా ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఇందులో గౌర వాధ్యక్షుడిగా సుధాకర్‌నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. శివారెడ్డి, అసోసియేట్ మహిళా ప్రెసిడెంట్ కె.హేమలత, ట్రెజరర్ బి.చంద్రశేఖర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లాకు పదిమంది కార్యదర్శులను మిగతా సభ్యులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పురం వెంకటరమణ, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కింద పడి కార్మికుడి మృతి

పీలేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం చేస్తున్న ఓ భవని నిర్మాణ కూలీ మూడవ అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మరణించిన సంఘటన సోమవారం పీలేరులో జరిగింది. పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన పి.ఇబ్రహీం(48) స్థానికంగా భవన నిర్మాణ రంగ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక సైనిక్ నగర్ ప్రాంతంలో పనికి వెళ్లాడు. మూడవ అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన సహచర కార్మికులు అతనిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడప పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా డి. శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో టెక్నికల్ మేనేజరుగా పనిచేస్తున్న శ్రీనివాసులుకు పీఏవోగా పదోన్నతి కల్పించి ఖాళీగా వున్న కడపలో నియమించారు. ఈయనతో పాటు మరో ముగ్గురికి కూడా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత సిలిండర్లపై గందరగోళం!



- మొదటి సిలిండరు తీసుకోవడానికి మార్చి వరకూ గడువు
- పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే
- కుటుంబంలో ఒక్క కనెక్షన్‌కు మాత్రమే అర్హత
- కేవైసీ మాత్రం తప్పనిసరి

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలుపై లబ్ధిదారుల్లో అనేక అపోహలు నెలకొన్నాయి. ఉచిత సిలిండర్ల మంజూరుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు చిన్నపాటివే అయినా లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. వీరి అనుమానాల నివృత్తికి అధికారుల వైపు నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉచిత సిలిండర్ల కోసం బుకింగులు మొదలై ఐదు రోజులు కావస్తున్నా ఈ పథకానికి తాము అర్హులో కాదో అనే విషయంలో కూడా స్పష్టత లేదు. దీనికి తోడు దీపం-1 పథకం లబ్ధిదారులకు మాత్రమే కొత్త పథకం వర్తిస్తుందనే ప్రచారం జరుగుతోంది. అంతేగాకుండా మహిళల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉంటేనే ఉచిత సిలిండర్లు అందుతాయనే అపోహలు కూడా నెలకొన్నాయి. ఇంకో వైపు కేవైసీ తప్పనిసరి అన్న విషయం తెలిసినా, దీన్ని ఎక్కడ చేసుకోవాలో తెలియక చాలా మంది అయోమయంలో ఉన్నారు. గతంలో దీపం పథకం ద్వారా కేవలం మహిళలకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఇప్పుడు తాజా పథకానికి దీపం-2 అనే పేరు పెట్టడంతో ఇది కూడా మహిళలకే పరిమితమనే ప్రచారం జరుగుతోంది. మరో వైపు కేంద్రం గతంలో ఉజ్వల పథకం కింద కూడా పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే మరో వైపు పేదలందరికీ ఉచిత సిలిండర్లు ఇవ్వకుండా ప్రభుత్వం మాట తప్పిందని ప్రతి పక్షాలు ప్రచారం మొదలెట్టాయి. గత వైసీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల అర్హతకు సంబంధించి ఆరేడు నిబంధనలు అమలు చేసింది. దీంతో అర్హత ఉన్నా చాలా మంది పేదలకు ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు. రేషన్ కార్డు ఉంటే చాలు.. ఉచిత సిలిండర్లకు అర్హులైనట్టేనని మరో వైపు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ కోవలో అయితే చాలా మందికి ఉచిత సిలిండర్లు దక్కే పరిస్థితి లేదు. సడలించిన నిబంధనలతో కొత్త రేషన్ కార్డులు జారీ అయితేగానీ దీనికి పరిష్కారం లభించదు. మరో వైపు జనవరిలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

కేవైసీ ఎక్కడ చేయించుకోవాలి..?

ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు.. ఇలా నాలుగు ఉంటేనే ఉచిత సిలిండర్లకు అర్హతగా ప్రభుత్వం పేర్కొంది. ఈ నాలుగూ ఉన్నా చివరికి కేవైసీ తప్పనిసరి అంటున్నారు. కేవైసీ అంటే నో యువర్ కస్టమర్ అని అర్థం. ఇక్కడ ఉచిత సిలిండర్ల లబ్ధిదారులు మూడు స్థాయిల్లో కేవైసీకి ప్రయత్నించాల్సి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే కేవైసీ అంటే ఎక్కడ చేసుకోవాలి? అకౌంటుకు సంబంధించి బ్యాంకులోనా, రేషన్ కార్డుకు సంబంధించి చౌక దుకాణం లోనా, గ్యాస్ కనెక్షనుకు సంబంధించి గ్యాస్ డీలరు వద్దనా, ఆధార్ కార్డుకు సంబంధించి ఆధార్ సవరణ కేంద్రంలోనా.. అనే అంశాలపై లబ్ధిదారులకు స్పష్టత ఇచ్చేవారు కరువయ్యారు. దీనికి సంబంధించి అధికారులు కూడా సూటిగా చెప్పలేకపోతున్నారు. ఈ అంశాలు కూడా ప్రజల్లో గందరగోళానికి కారణమవుతున్నాయి.

డాక్యుమెంట్లు సమర్పించాలన్న మరో పీటముడి

కేవైసీపై గురించే లబ్ధిదారుల్లో గందరగోళం ఉండగా.. సిలిండరు బుక్ చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ మంజూరు పత్రం అప్‌లోడ్ చేయాలని చెపుతున్నారని లబ్ధిదారులంటున్నారు. దీని కోసం ఇంటర్నెట్ కేంద్రాలకు వెళితే వందల్లో రుసుము వసూలు చేస్తారని, అన్నీ లెక్కిస్తే ఉచిత సిలిండర్ ధరకు సరిపోతుందనే విమర్శలున్నాయి. అలా కాకుండా అర్హులైన వారికి శాశ్వతంగా గుర్తింపు కార్డులు జారీ చేస్తే సరిపోతుంది కదా అని సూచిస్తున్నారు.

ఉచిత సిలిండర్‌కు అర్హులెవరంటే..

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం అర్హులెవరనే దాని పైన అధికారులు ఇప్పుడిప్పుడే వివరణలు ఇస్తున్నారు. కుటుంబంలోని పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నాగానీ ఉచిత పథకానికి అర్హులుగానే చెపుతున్నారు. ఒక వేళ భార్య పేరుతో రేషన్ కార్డు ఉండి భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులవుతారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటున్న కారణంగా ఒక రేషన్ కార్డుకు ఒక గ్యాస్ కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంటుంది. ఉచిత సిలిండర్ల కోసమైతే ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు తప్పనిసరి. బ్యాంకు ఖాతాకు, రేషన్ కార్డుకు, గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి. అదనంగా మొబైల్ నంబరు కూడా కలిగి ఉండాలి. గ్యాస్ కనెక్షన్ మంజూరయిన వ్యక్తి ఆ కుటుంబ రేషన్ కార్డులో తప్పనిసరిగా ఉండాలి. ఒకే రేషన్ కార్డులోని ఇద్దరు ముగ్గురు పేరుతో గ్యాస్ కనెక్షన్‌లుంటే ఉచిత సిలిండర్ పథకం మాత్రం ఒకరికే వర్తిస్తుంది. ఇందులో ఏ కనెక్షన్‌కు ప్రాధాన్యమిస్తారన్న విషయంలో స్పష్టత రావలసి ఉంది. పాతికేళ్ల క్రితం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం దీపం పథకం పేరుతో ఇచ్చిన ఉచిత గ్యాస్ కనెక్షన్లతో పాటు కేంద్రం మంజూరు చేసిన ఉజ్వల పథకానికి కూడా దీపం-2 (ఉచిత సిలిండర్ పథకం) వర్తిస్తుంది. గ్యాస్ బుకింగ్ ఆన్‌లైన్‌లో లేదా డీలర్ వద్ద చేసుకోవచ్చుగానీ వాటికి అవసరమైన డాక్యుమెంట్ల విషయంలో ఎవరికీ స్పష్టత లేదు. సిలిండర్‌కు డెలివరీ సమయంలో నగదు చెల్లించిన అనంతరం గ్యాస్ కంపెనీ నుంచి రెండు రోజుల్లో ఆ డబ్బు తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుంది.

అవసరమైన అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని పథకం ప్రారంభించి ఉంటే బాగుండేదనే విమర్శలున్నా మొదటి సిలిండర్ పొందడానికి ఐదు నెలలు (వచ్చే ఏడాది మార్చి వరకూ) గడువు ఉన్నందువల్ల తొందరపడాల్సిన అవసరం లేదని అధికారులు సర్దిచెపుతున్నారు. ఇందులో ఏవైనా సందేహాలుంటే నివృత్తి కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్‌ల మూత

- బయట ఫుడ్ కోసం ఆర్డర్లు
- యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం
- నిరసనకు దిగుతున్న విద్యార్థులు



వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. వేంపల్లెలో ఆర్డర్ చేసుకొని రాత్రి 10, 11 గంటలకు కూడా బయటి ఫుడ్ తీసుకుంటుండడంతో ట్రిపుల్‌ఐటీ యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మాకు బయటి ఫుడ్ కావాలంటూ విద్యార్థులు ఆది, సోమవారాల్లో రాత్రిపూట కొంతసేపు నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఉన్న ఐదు క్యాంటీన్లు గత నెలలో రద్దు చేయడంతో మూతపడ్డాయి. ఆ క్యాంటీన్లు ఉన్న సమయంలో మెస్‌లో తినని విద్యార్థులు క్యాంటీన్లకు వెళ్లితినేవారు. ప్రస్తుతం మూతపడడంతో బయట ఫుడ్ ఆర్డర్ చేస్తూ ట్రిపుల్ ఐటీకి తెప్పించుకుంటున్నారు. రాత్రి 11 వరకు తెప్పించుకుంటుండడంతో ట్రిపుల్‌ఐటీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 8 లోపు తెప్పించుకోవాలని సూచించడంతో అప్పటికే ఆర్డర్లు ఇవ్వడం వల్ల బయటిఫుడ్ మాకు ఇవ్వాల్సిందేనని నిరసన తెలిపారు. అప్పటికి సర్దిచెప్పి ఫుడ్‌ను ఇప్పించి పంపించారు. రోజు రాత్రివేళల్లో ఇదే పరిస్థితి తలెత్తుతోంది. ట్రిపుల్‌ఐటీలో వెంటనే క్యాంటీన్లను ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసర ఎంతైనా ఉంది. ఈ విషయాన్ని డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకెళ్లగా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటవుతాయని తెలిపారు. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

మెస్‌లలో సక్రమంగా ఉండడం లేదా...

ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు మెస్సుల్లో తినకుండా క్యాంటీన్లకు ఎగబడడం, అవి లేకపోవడంతో బయటినుంచి ఫుడ్ తెప్పించుకుంటుండడంతో మెస్‌లలో ఫుడ్ సక్రమంగా ఉండడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెస్సులపై ఫిర్యాదులు రావడంతో ఇప్పటికే రద్దు చేశారు. వాటినే తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆర్జీయూకేటీ సిద్ధమవుతోంది. మెస్‌లలో నాణ్యమైన ఆహారం అందిస్తే విద్యార్థులు క్యాంటీన్ల వైపు మొగ్గుచూపరు కదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆ విధంగా ట్రిపుల్‌ఐటీ యాజమాన్యం విద్యార్థులకు మంచి ఆహా రం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ప్రశాంతంగా ముగిసిన గెస్ట్‌ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు



కడప(ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలో వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, ప్రొఫెసరు దాము, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ కర్నూలు రాయలసీమ యూనివర్శిటీ ప్రొఫెసరు విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసరు శ్రీదేవి, ప్రొఫెసరు విజయభారతి, డాక్టర్ శ్రీధర్‌బాబు, డాక్టర్ రమణ, సుభాష్‌చంద్ర, డాక్టరు శ్రీనివాసరావు ఇంటర్వ్యూల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయని.. ప్రతిభతో పాటు పీహెచ్‌డీ, నెట్ అర్హత ఉన్న వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్టు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాల పెంటకు చెందిన ఫిర్దోస్ అనే మహిళ భర్త వేధింపులు తాళలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త కరీముల్లాను సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 17సంవత్సరాల క్రితం ఫిర్దోస్‌ను కరీముల్లా పెళ్లి చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్యను శారీరక మానసికంగా వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు నిందితుడు కరీముల్లాను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

‘ఎస్‌ఐ చితక్కొట్టాడు’

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలో మట్టి పోస్తుండగా ఇరువురు కానిస్టేబుళ్లు వచ్చి తనను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారని.. తనను చూసిన వెంటనే ఎస్‌ఐ చితక్కొట్టాడంటూ బాధితుడు జయశంకర్ వాపోయాడు. బాధితుడి వివరాల మేరకు...

పెండ్లిమర్రి మండలం నందిమండలం బస్టాండు వద్ద 18ఏళ్లక్రితం స్థలం కొనుగోలు చేశామని.. అయితే తమ స్థలం పక్కనే నాగేంద్రకు చెందిన స్థలం ఉందన్నారు. ఆదివారం నా స్థలంలో మట్టి వేసుకుంటుండగా నాగేంద్ర పోలీసులకు ఫిర్యా దు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ వచ్చి తనను తీసుకెళ్లగా.. ఎస్‌ఐ విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడన్నారు. పేపర్లు పరిశీలించాలని కోరినా వినిపించుకోలేదన్నారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదనరెడ్డిని వివరణ కోరగా.. నాగేంద్ర ఇంటి పక్కన ఉన్న స్థలంలో మట్టిపోయయడంతో తమకు ఫిర్యాదు చేశాడన్నారు. అతన్ని పిలిపించి స్థలం వద్ద గొడవ పడకూడదని.. ఏదైనా ఉంటే తహసీల్దారుకు ఆ స్థలం వివరాలు ఇవ్వాలని కోరుతామని చెప్పి పంపించామే తప్ప అతనిపై ఎలాంటి దాడి చేయలేదన్నారు.

సీఎంపై అసభ్య పోస్టింగులు.. ఇరువురిపై కేసు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగులు పెట్టిన ఇరువురిపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన శ్రీనివాసులు మరో వ్యక్తి కలిసి సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, లోకేశ్‌లపై పోస్టింగులు చేశారు. దీంతో టీడీపీనేత తిరుమలేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇరువురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నమస్తేబోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కిశోర్ (16) అనే బాలుడు మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన కిశోర్ స్కూటీలో వెళుతుండగా మరో వాహనం వచ్చి ఢీకొట్టడంతోతీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడు అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మృత్యుంజయకుంట చెందిన మణికంఠ అనే బాలుడు అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మణికంఠ మరో నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం బాలుడి తండ్రి ఓబులరాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా మణికంఠతో పాటు వెళ్లిన పిల్లలను విచారించగా చెన్నూరు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లగా మణికంఠ నీటి లో మునిగిపోయి గల్లంతైనట్లు అధికారుల దృష్టికి తీసకువచ్చారు. మణికంఠ నగరంలోని ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. గల్లంతైన మణికంఠ కోసం పోలీసులు గాలిం పు చర్యలు చేపట్టనున్నారు.

యువతి అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ఇక్బాల్ రైస్‌మిల్లు సమీపంలో యువతి సోమవారం అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తేజస్విని ఇంటర్ పూర్తి చేసి డాక్టరు కోర్సు కోసం ఇంట్లో ఉండి చదువుకుంటోంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఓవరాల్ చాంపియన్ కడప జట్టు



ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న కడప జిల్లా జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ బాలబాలికల పోటీల ఓవరాల్ చాంపియన్‌గా కడప జిల్లా నిలిచింది. మొత్తం 11 బంగారు, నాలుగు రజిత, ఒక కాంస్య పతకంతో సత్తాచాటారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారంతో ముగిసాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా ఐదు బంగారు, 10 రజిత, ఐదు కాంస్య పతకాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా ఐదు బంగారు, ఒక రజిత, ఐదు కాంస్య పతకాలతో తర్వాత స్థానంలో నిలిచింది. అదేవిధంగా శ్రీకాకుళం ఒక బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు బంగారు, రెండు రజిత, మూడు కాంస్య పతకాలు, గుంటూరు జిల్లా మూడు బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు, కృష్ణ జిల్లా ఒక బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతకాలు సాధించాయి. ప్రకాశం జిల్లాకు చెరో బంగారు, కాంస్య పతకాలు, కర్నూలు జిల్లాకు మూడు బంగారు, రెండేసి రజిత, కాంస్య పతకాలు వచ్చాయి. అనంతపురం జిల్లా చెరో బంగా, రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, నెల్లూరు ఒక రజితం, రెండు కాంస్య పతకాలు, చిత్తూరు జిల్లాకు ఒక కాంస్య పతకం వచ్చింది. ఇందులో మెరిట్ ఉన్నవారికి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ తెలిపారు.

గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయం



డీఆర్వో గంగాధర్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. డీఆర్వో బాపట్ల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయనకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ అధికారిగా విశేష సేవలు అందించి, అందరు ఉన్నతాధికారుల మన్ననలను పొందారన్నారు. ఆయన బదిలీపై వెళ్లడం బాధాకరమని, కానీ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలం పని చేయడం అదృష్టమన్నారు. రెవెన్యూ అధికారులందరి సహకారంతో పనిచేయగలిగామన్నారు. బదిలీపై వెళుతున్న ఆయనను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, విజయకుమార్, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, వెంకట్రావు, ఆర్డీవోలు, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

‘అ’.. ఆయనా..!

- నీటిపారుదలశాఖలో హల్‌చల్
- లోకేశ్ ఫ్రెండ్ అంటూ ప్రచారం
- చక్రాయపేటలో ఇల్లు కూల్చారనే నెపంతో..
- ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వని వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్న పనికావాలన్నా.. నీటిపారుదలశాఖ కార్యాలయంలో వాచ్‌మాన్ తలుపు తెరవాలన్నా ఒకాయన పేరే వినిపిస్తుంది. ఆయనే ‘అ’ అనే అక్షరంతో మొదలయ్యే పేరున్న వ్యక్తి. మొన్నటి వరకు కనీసం అడ్రస్ లేని వ్యక్తి ఇప్పుడు కడపలో ప్రముఖమైన వ్యక్తిగా మారాడంటారు. ఉద్యోగం కావాలన్నా, బదిలీ కావాలన్నా, ఏదైనా పదవి కావాలన్నా.. ఆఖరుకు ఏదైనా సిఫారసు అయినా సరే.. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ ఎలా కుట్టదంటారో అలా.. ‘అ’ ఆజ్ఞ లేనిదే అటు పాలిటిక్స్, ఇటు అధికార యంత్రాగంలో పని జరగదంటారు. ఎలా అంటే ఈయన మంత్రి నారాలోకేశ్, సీఎం చంద్రబాబు పేరు చెప్పుకోవడంతో పాటు కడప ముఖ్య నేత అనుచరుడని చెప్పుకుంటూ ముఖ్యంగా నీటిపారుదలశాఖలో హవా కొనసాగిస్తున్నారు. ఒక ఇన్‌చార్జి ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వకుండా అడ్డుకున్నాడంటే ‘అ’ పవరేమిటో అర్థమవుతుంది.

ఈఈని అడ్డుకున్నారు

ఆయనకు ఉండే బ్యాక్‌గ్రౌండ్ ఏందంటే టీడీపీ కేడరుగా ఉంటూ లోకేశ్ పాదయాత్రలో పాల్గొనడం. దీనికి తోడు ఇప్పుడు కడపను ఏలుతున్న ముఖ్య నేత సామాజిక వర్గం కావడంతో ఆయన ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. వామ్మో.. వైసీపీ నేతలే మేలన్న స్థితికి ఈయన తీసుకువచ్చారు. కడప మైనర్ ఇరిగేషన్ ఈఈ బాల చంద్రారెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య డివిజనులో పనిచేస్తున్న మురళీక్రిష్ణ ఈఈగా వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లగా చక్రాయపేటకు చెందిన కడపలో రుబాబు చేస్తున్న ‘అ’ అనే వ్యక్తి అడ్డుకున్నట్లు చెబుతారు.

చెరువులో కట్టారని..

చక్రాయపేట మండలంలోని ఓ చెరువులో అక్రమ కట్టడాలు అంటూ 2019లో జగన్ ప్రభుత్వం ‘అ’ ఇంటిని కూల్చింది. అప్పట్లో జగన్ కుటుంబీకులు చెప్పిందే వేదం. రాష్ట్రానికి జగన్ సీఎంగా ఉన్నప్పటికీ జిల్లాకు అంతా పులివెందుల నేతలే సుప్రీంగా వ్యవహరించారు. ముఖ్యంగా చక్రాయపేటకు కొండారెడ్డి చెప్పిందే ఆజ్ఞ అంటారు. అప్పట్లో పై నుంచి వచ్చిన ఆదేశాలు, రెవెన్యూ అధికారుల రిపోర్టు మేరకు ‘అ’ ఇల్లు కూలగొట్టారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో.. తన ఇంటిని కూలగొట్టిన ఇరిగేషన్ అధికారులపై ఆయన పగబట్టినట్లు చెబుతారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ‘అ’ ఇంటిని కూలగొట్టిన టీంలో ఉన్న మురళీకృష్ణ ఇప్పుడు ఈఈగా రాగా విధుల్లో చేరనివ్వకుండా ఆయన అడ్డుకున్నారు. మీరు అప్పుడు ఇల్లు పగలగొట్టారు, నాకు నష్టపరిహారం ఇవ్వండి అంటూ ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులను ‘అ’ డిమాండ్ చేస్తున్నారంటారు. టీడీపీకి చెందిన ముఖ్య నేత కూడా ఆయనతో మాట్లాడుకుని సెటిల్ చేసుకోవాలంటూ అధికారులకు సలహా ఇస్తుండడమే ఇప్పుడు చర్చగా మారింది.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాముకాటు



పాఠశాలలో పామును చంపిన దృశ్యం, పాముకాటుకు గురైన వర్షిణి, పల్లవి

కొండాపురం, నవ ంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురయ్యారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతి వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలో నిద్రిస్తున్న మోటుపల్లి పల్లవి, కోగటం వర్షిణి అనే ఇద్దరు 8వ తరగతి విద్యార్థినులను పాము కాటేసింది. దీంతో ఏదో కుట్టిందని.. అక్కడే వారితోపాటు ఉన్న పీడీ కాటమ్మకు తెలియజేశారు. దీంతో పాఠశాలలోని హెల్త్‌సూపర్‌వైజర్‌తో చెకప్ చేయించారు. ఎలుకలు కరిచినట్లు అనుమానంతో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ప్రొద్దున్నే 6 గంటల ప్రాంతంలో డార్మెంటరీలో పిల్లలు బ్రష్ చేస్తుండగా పాము కనపడింది. దీంతో పామును సిబ్బంది సహాయంతో చంపేశారు. దీంతో విద్యార్థులకు పాము కుట్టి ఉండవచ్చునన్న అనుమానంతో వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి విద్యార్థిని దగ్గరే ఉండి చికిత్స చేయిస్తున్నారు. కాగా పల్లవి అనే విద్యార్థిని ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో అబ్జర్వేషన్ నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా ప్రస్తుతం ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విషయం తెలుసుకున్న జమ్మ ల మడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విషపురుగులు పాఠశాలలోకి రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ గురప్ప, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవోలు ఓబులేసు, నాగ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో

ప్రారంభమైన సెమిస్టరు పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో బీఈడీ కళాశాలల 2, 4 సెమిస్టరు పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలకు సంబంధించి 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తనిఖీలు నిర్వహించారు. కడప నగరంలో ఎస్వీ బీఈడీ కళాశాల శ్రీహరి బీఈడీ కళాశాలల కేంద్రాలో విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని.. ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలు రాసే ఏర్పాట్లు చేయాలని సూచి ంచారు. ప్రతి కేంద్రం నుంచి అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని హైపవర్ కమిటీ ప్రతినిధులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. హైపవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసరు సునీత, రియాజున్నీసా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పాపాఘ్నిలో ఇసుకను తోడేస్తున్నారు

- నది వద్ద రైతుల ధర్నా

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించడంతో వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను విచ్చలవిడిగా తోడేస్తున్నారు. యథేచ్ఛగా వాహనాల్లో తరలుతున్న ఇసుకపై పాపాఘ్ని పరివాహక భూముల రైతులు ఆందోళనకు గురై సోమవారం నిరసనకు దిగారు. పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డగించి ధర్నా చేశారు. అక్కడే బైఠాయించారు. ఇసుక యథేచ్ఛగా తరలిపోతే భూగర్భజలాలు అడుగంటి ప్రజలకు తాగునీరు ఉండవని, నీళ్ల వచ్చినపుడు భూములు కోతకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, తహశీల్దార్‌కు తెలియజేశారు. రైతులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపి ఆందోళన చేశారు. అక్కడున్న ట్రాక్టర్లను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుకను అవసరమైన వారు ఉచితంగా రీచ్‌లలో తెచ్చుకోవాలని, ఇతర అవసరాల కోసం వస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హరినాథరెడ్డి వారిని హెచ్చరించి పంపించేశారు.



వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి నిరసన తెలుపుతున్న రైతులు

రిమ్స్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అన్నదానం

- కందుల చంద్ర ఓబుళరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం ప్రతి మంగళ, శుక్రవారాల్లో రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహిస్తామని విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కందుల శివానందరెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళలర్పించి రక్తదాన శిబిరం, భగవద్గీత పారాయణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్‌సెట్ 2024 ద్వారా కేఎస్‌ఆర్‌ఎం కళాశాలలో మెరిటోరియస్ విద్యార్థులకు, కేజీసెట్ 23 స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, మొత్తం 38 మంది విద్యార్థులకు విద్యలో కొనసాగడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రిమ్స్‌లో సదరం సర్టిఫికెట్లు, అనారోగ్యంతో వచ్చే వారికి 350 మందికి అన్నదానం, మంచినీరు అందిస్తామన్నారు. వైస్‌ఛైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కందుల శివానంద రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని, ప్రజలకు ఉచిత మంచినీటి సరఫరా, ఉచిత భోజ నం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన మరుపురాని మనిషి అన్నారు. ప్రిన్సిపల్ వీఎస్ ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, ఛైర్మన్ రాజమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ టీఎస్‌ప్రసాద్, కేఎల్‌ఎం ప్రిన్సిపల్ రత్నమ్మ, కేఎస్‌ఆర్‌ఎం మేనేజ్‌మెంట్ స్టడీ ప్రిన్సిపల్ నాగమణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.10 లక్షల చెక్కును సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రాయచోటి నియోజకవర్గంలోని వ్యాపారులు ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు పేర్ల నమోదు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారతాధికారి ఎన్. జయప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద ఎస్సీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణకు నవంబరు 3న జరగాల్సిన స్ర్కీనింగ్ టెస్టును 10వ తేదీకి వాయిదా వేసినట్లు అందులో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

8న పుల్లంపేట మండల సమావేశం

పుల్లంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, ఉపాధి కార్యక్రమాలపై సమీక్షిస్తామని వివరించారు. ఎంపీపీతో పాటు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

రైల్వేకోడూరు, నవంబరు 4:(ఆంధ్రజ్యోతి) మండలంలోని రాఘవరాజపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 6న విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు విద్యుత్ ఏడీఈ భాస్కర్ రావు తెలిపారు. రైల్వేకోడూరు పట్టణం, రూరల్, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట, రాజంపేట టౌన్, రాజంపేట రూరల్ నందలూరు, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం సెక్షన్లలోని. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. రాజంపేట డివిజన్ డీఈ ఎస్. రాజశేఖర్ రెడ్డి, రిటైర్డ్ జడ్జి వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కే. రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులే భావి భారత నిర్మాతలు

సంబేపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే భావి భారత నిర్మాతలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో దేశ్ అప్నా ఏ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వ తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్యం గొప్ప తనంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పందేరానికి పదవులు సిద్ధం!

- పోటీ పడుతున్న మాజీలు
- ఉత్తములను ఎంపిక చేయాలని ఆదేశాలు
- భుజంగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవి ఎవరికో?



భుజంగేశ్వరస్వామి ఆలయం

రైల్వేకోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకవర్గం నియామకం పూర్తవడంతో, రాష్ట్రం పలు ఇతర ఆలయాలకు పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయ పాలక కమిటీని నియమించాలని అధికార పక్షంలోని ఎమ్మెల్యేలు, పార్టీల ఇన్‌చార్జిలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఆలయానికి సంబంధించిన ఆస్తులు, అద్దెలు, ఆదాయంలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి దేవదాయ శాఖ అధికారులను కోరినట్లు తెలిసింది. పేరు ప్రతిష్ఠలతోపాటు, నైతిక విలువలు, నిస్వార్థంగా పనిచేసే వ్యక్తులనే పాలక కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించినట్లు తెలిసింది. కాగా, ఈ పదవులకు మాజీ చైర్మన్లు తీవ్రంగా పోటీ పడుతుండడంతో చైర్మన్ పదవికి అర్హులను ఎంపిక చేయడంలో కూటమి నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. మాజీలకు పదవులు ఇచ్చే ప్రసక్తి లేదని నిర్ణయించినట్లు తెలిసింది. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండి, అవినీతికి తావు లేని వ్యక్తికే చైర్మన్ పదవి కట్టబెట్టాలని వారు భావిస్తున్నారు.



మార్కెట్ యార్డు ముఖద్వారం

మార్కెట్ కమిటీ పదవికి పెరిగిన పోటీ

కోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పోటీ పెరిగింది. గతంలో ఈ పదవిలో అధికంగా క్షత్రియసామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం ఈ పదవి రెడ్డి సామాజిక వర్గానికి దక్కింది. తర్వాత రెండు సార్లు క్షత్రియ సామాజిక వర్గానికే ఇచ్చారు. ఈ సారి బలిజ సామాజిక వర్గానికి ఈ పదవి ఇవ్వాలంటూ కూటమి నాయకులపై వత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ అభివృద్ధి లక్ష్యంగా అందరితో చర్చించి మంచి వ్యక్తిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవాలని కూటమి నాయకులు నిర్ణయానికి వచ్చారు. క్షత్రియ, రెడ్డి, బలిజ సామాజిక వర్గాల్లో ఎవరిని పదవి వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

హరహర నాదంతో మార్మోగిన శివాలయాలు



రైల్వేకోడూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఒంటిమిట్ట: పురాతన మృకుండాలయంలో పూజలందుకుంటున్న శివలింగం



కట్టవారిపల్లెలో నూతన అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు 4:(ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లజాము నుంచే మండలంలోని భుజంగేశ్వర, భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయాల్లో శివుడికి అభిషేకాలుచేశారు. ఉదయం భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. అర్చకులు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగీ, మల్లికార్జున శర్మ, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలి శివాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహానైవేద్యం, మంగళహారతి, అమ్మవారికి పసుపు, కుంకుమ అలంకరణ చేశారు. సాయంత్రం లలితాసహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. నక్కలపల్లె, భవానిశంకర్ ఆలయం, పాతచిట్వేలి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం, గుండాలకోన, మూలరోడ్డు వద్ద ఉన్న శివాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మండలంలోని మృకుండ శివాలయంలో స్వామివారిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించి అన్నదానం చేశారు. సాయంత్రం దీపారాధన నిర్వహించి మహిళలు భక్తి భావాన్ని చాటుకున్నారు.

పెనగలూరు : మండలంలోని కట్టవారిపల్లెలోని స్తంభాల ఈశ్వరయ్య ఆలయంలో అప్పారాజుపేటకు చెందిన కొల్లా రామాంజులనాయుడు, ఎన్ఆర్ఐ కొల్లా నరసింహులునాయుడు, మాజీ సర్పంచ్ కె.నాగేశ్వరనాయుడు నిర్మించిన అన్నదాన సత్రాన్ని సోమవారం టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ప్రారంభించారు. బోడమలేశ్వరస్వామి ఆలయంలో వీఎంపురం గ్రామానికి చెందిన రామచంద్రయ్య రాయల్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కస్తూరి శ్రీనివాసనాయుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోనేటి రెడ్డి, కృష్ణరాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సరిగా వ్యాధి నిర్ధారణ చేయకుండానే ఆపరేషన్ చేసి ఆమె మృతికి కారణం కావడంతోపాటు, ప్రశ్నించిన బంధు వులపై దాడి చేసిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు, బంధువులతో కలసి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టీఎల్ వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 30న చికిత్స నాగేశ్వర అనా రోగ్యంతో ఉన్న తన తల్లిని పీలేరు ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, సమస్య ఏదో సరిగ్గా గుర్తించకుండా పలురకాల పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ చేశారన్నారు. దీంతో ఆమె కోలుకోకపోగా, ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో మదనపల్లె మోడ్రన్ హాస్పిటల్‌కు పంపించారన్నారు. అక్కడ ఎటువంటి చికిత్స చేయకుండా సమయం వృథా చేయడంతో ఆమె మృతి చెందిందన్నారు. దీంతో బంధువులు ఆమె మృతదేహాన్ని తీసుకుని తిరిగి ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు వెళ్లగా యాజమాన్యం వారిపై దౌర్జన్యం చేసిందన్నారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టరు విచారణ కు ఆదేశించారన్నారు. అయితే, విచారణ అధికారి సైతం హాస్పిటల్ యాజ మాన్యంతో పాటు, పీలేరు ప్రభుత్వ డాక్టర్లతో కలిసి ఏకపక్షంగా చేసినట్లు కలెక్టర్‌కు వివరించడంతో ఆయన మరోసారి విచారణకు ఆదేశించారని తెలిపారు.

పే స్కేలు అమలు చేయాలని వీఆర్ఏల ధర్నా



ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేస్కేలు అమలు చేయాలంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్ఏలు అన్నమయ్య కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో 30 ఏళ్లనుంచి వీఆర్ఏలు అరకొర వేతనాలతో పని చేస్తున్నారన్నారు. కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ 26 వేలు వేతనం, నామినీల గుర్తింపు అర్హులందరికీ ప్రమోషన్, ఇళ్ల స్థలాల మంజూరు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, నైట్ డ్యూటీలు రద్దు తదితర డిమాండ్లు చేశారు. వీఆర్ఏలు నరసింహులు, అల్లా బకష్, శ్రీను, నాగరాజు, మధు, సుధా కర్, రమణ, రామచంద్ర, మల్లికార్జున, రెడ్డెయ్య, శంకర్, మగ్బుల్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వారంలోపు అపార్ నమోదు పూర్తి చేయాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, అంగన్‌వాడీ, ఆధార్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యే శ్రద్ధ తీసుకొని వారంలోపు అపార్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెయ్య, ఎంఈఓ చక్రేనాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దాదాబీ, తులశమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కిషోర్, దళితవేదిక అధ్యక్షుడు ఓబులేసు, శ్రీనివాసులు, ఈవోపీఆర్డఈ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ అమలు చేయాలి



లక్కిరెడ్డిపల్లె: సచివాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పిస్తున్న రంగారెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మి క సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడంతో వ్యవసాయ కార్మికుల పిల్లలు చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ అమలు కాకపోతే పేదల ఇబ్బందులు పాలవుతారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ౹ యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ రైతు భరోసా కింద 20 వేల రూపాయలు ఆర్థిక సాయం, మహిళలకు చేయూత పథకం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, సుమిత్రమ్మ, టీ. వెంకటేశ్‌తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు రైతుల ఖాతాలో ఇంకా జమ చేయలేదంటూ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు వినతిపత్రాలు సమర్పించారు. రైతులు దుక్కులు చేసి పొలాలను సిద్ధంగా ఉంచారని ప్రభుత్వం వెంటనే విత్తనాలు రైతులకు అందించాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల11న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్‌లకు వినతి పత్రాలు సమర్పించి 20న గ్రామ సచివాలయాల వద్ద నిరసన తెలుపుతామన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, షబ్బీర్, మహబూబ్‌బాషా, రైతులు పాల్గొన్నారు

టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని మండల వెలుగు కోఆర్డినేటర్ ఖాదర్‌వలి కోరారు. సోమవారం మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టలు పంపిణీ చేశామని, నాణ్యమైన 18కి 24 సైజు గల పట్ట 1650 రూపాయలకు ఇస్తున్నామన్నారు. అవసరమైన రైతులు తమ గ్రామంలోని రైతు మిత్రలను కలిసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీజీ సీసీ గంగాధరం, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

పెనగలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి శ్రీకృష్ణ పెయింట్స్, హార్డ్‌వేర్ యజమాని హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదిగినవారికి తనవంతు సాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ, హరిప్రసాద్, కృష్ణకుమారి, పరిమళ, ప్రమీల, శ్రీవాణి, నరసింహులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో సభ్యత్వ నమోదు

సిద్దవటం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి టక్కోలిలో సభ్యత్వ నమోదు చేస్తున్నట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగముని రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు, మేధావులు స్వచ్ఛందం గా సభ్యత్వం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపరెడ్డి సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ దిమ్మెలు ధ్వంసం



ధ్వంసమైన దిమ్మెలు

ఒంటిమిట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నడింపల్లె గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పొలం కాంపౌండ్ వాల్ ఏర్పాటు కోసం పాతిన దిమ్మెలను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దిమ్మెలను ధ్వంసం చేశారు. దీంతో సుమారు 2 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితు డు తెలిపాడు. ఈ విషయంపై సోమ వారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడికి ఎవరితోనైనా కక్షలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు సీఐ టీకే.తులసి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుతో కలిసి చిట్వేల్, కోడూరు ప్రధాన రహదారుల్లో సోమవారం దాడులు నిర్వహించారు. చిట్వేల్ మండలానికి చెందిన ఇద్దరి నుంచి 70 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. కోడూరు మండలానికి చెందిన ఇద్దరి నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం నియోజకవర్గ పరిధిలో నాలుగు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జహీర్, కోడూరు ఎస్ఐ వరుణ్‌కుమార్ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'హౌసింగ్'లో అవినీతిపై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు4 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వల్లపు సాంబశివ అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లపు సాంబశివ తనవద్ద పనిచేసే అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ల నుంచి ఆయన కుటుంబ సభ్యుల అకౌంట్లలో ఫోన్‌పే ద్వారా లక్షలు రూపాయలు వేయించుకుంటున్నారన్నారు. నకిలీ ఓచర్లు సమర్పించి ప్రతి నెల 40 వేల రూపాయలు చొప్పున రెండేళ్లుగా డ్రా చేసుకుంటున్నాడని ఆరోపించారు. సంస్థ ఖర్చులకోసం ప్రతి మూడు నెలలకోసరా మంజూరయ్యే నిధులు దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. రాయచోటి, రామాపురం, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె మండలాల్లో కోట్లరూపాయలు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశాడన్నారు. ఈ అంశాలపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణ, ఆంజనేయులు, సుజాత, సుబ్బమ్మ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పంతగాని ఇంటికి హోం మంత్రి అనిత



పంతగాని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

రైల్వేకోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ ఇంటికి సోమవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విచ్చే శారు. అల్పాహారం తీసుకుని పంతగాని కుటుంబ సభ్యులతో కొంత సేపు ముచ్చటించారు. కొన్ని రోజుల క్రితం విజయవాడలో హోం మంత్రిని కలిశామని, తిరుపతికి వచ్చినప్పుడు తమ ఇంటికి రావాలని తాను అభ్యర్థించడంతో ఆమె వచ్చారని నరసింహప్రసాద్ మీడియాకు వివరించారు.

నిలిచిన రైళ్ల పునరుద్ధరణ.. కొత్త రైళ్ల కోసం వినతి



పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి వినతిపత్రం అందజేస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరోనా సమ యంలో నిలిచిన రైళ్లను పునరుద్ధరించడంతోపాటు కొత్త రైళ్లను నడపాలని డీఆర్‌సీసీ మాజీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి పార్లమెంట్ స్టాం డింగ్ కమిటీ ప్రతినిధులను కోరారు. రైల్వే అభివృద్ధి పనులపై అధ్యయనం చేసేందుకు వచ్చిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బృందాన్ని ఆయన సోమవారం కలిశారు. తిరుపతి తాజ్ హోటల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు సమస్యలను కమిటీకి విన్న వించారు. కరోనా రాకముందు రాజంపేటలో నిలుపుతున్న రైళ్లను యథా విధిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్తీక మాసం నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప స్వాములను పరిగణలోకి తీసుకుని కన్యాకుమారి వరకు వెళ్లే రైళ్లను రాజంపేటలో ఆపాలన్నారు. శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, మలే రియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రతలు పా టించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. సోమవారం మండలంలోని బిల్డింగ్ హరిజనవాడలో ఆయన ఇంటింట సర్వే నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వై ప్రసాదుయాదవ్, దేవళంపల్లె డాక్టర్లు నజీయా, సుమలత, ఎంపిహెచ్‌ఈవో దేవదానం, ఏఎన్ఎంలు విజయకుమారి పాల్గొన్నారు

పెయింటర్లకు పని భద్రత కల్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న పెయింటర్లు

రాజంపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పనిభద్రత కల్పించాలంటూ పట్టణంలోని పెయింటర్లు సోమవారం ర్యాలీ నిర్వహించారు. రాజంపేట పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ నిధియాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పెయింటర్స్ కారణంగా స్థానికులకు పని దొర కడం లేదన్నారు. దీనివల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇతర రాష్ట్రాల వారు తక్కువ ధరకే పనిచేయడం వల్ల తాము నష్టపోతున్నామన్నారు. రమణ, కృష్ణయ్య, శివ, చంద్ర, సుబ్బయ్య, సత్య, రెడ్డయ్య, మూస, శ్రీను, జిలాని, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

డ్రగ్ అడిక్షన్ అండ్ ఎబ్యూజ్‌పై అవగాహన

రామాపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ అడిక్షన్ అండ్ ఎబ్యూజ్ అనే అంశంపై జిల్లా టూరిజం అధికారి నాగభూషణం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో సోమవారం నెహ్రూ యువ కేంద్రంతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఎస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థు లు మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకోకూడదన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులతోపాటు వీఆర్ పాఠశాల వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా నైపుణ్య గణన



ఒంటిమిట్ట:సూచనలు ఇస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ

రైల్వేకోడూరు, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య గణనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్, ఎంపీ డీవో నాగార్జునరావు తెలిపారు. సోమవారం రైల్వే కోడూరు మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఉపాధి, సచివాలయ సిబ్బందికి నైపుణ్యగణనపై శిక్షణ ఇచ్చారు.

సిద్ధవటం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో ఫనిరాజకుమారి తెలియజేశారు. మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, గ్రామ పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారని వివరించారు.

ఒంటిమిట్ట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, పంచాయతి కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శి సుధాకర్, శివకుమార్, భావన పాల్గొన్నారు.

నందలూరు: నందలూరులో ఎంపీడీవో సుజాతమ్మ, మండల నోడల్ ఆఫీసర్ పెంచలయ్య సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య గణన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మల్‌రెడ్డి మాట్లాడారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో రెడ్డెయ్య మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరు నైపుణ్య యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, ఇమామ్‌భాషా, జయశ్రీ, రజనీష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, నాగమణి, మల్లికార్జునరెడ్డి, భాస్కర్, వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

రైతు సంఘాలు బలోపేతం కావాలి

వీరబల్లి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రైతు సంఘాలు బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి పిలుపునిచ్చారు. సోమవారం వివేకానంద ఉన్నత పాఠశాల ఆవరణంలో వీరభద్ర రైతు సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల విధులు, బాధ్యతలు తెలియజేశారు. వ్యవసాయ పెట్టుబడులకు మండల సమాఖ్య, బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి విరివిగా రుణాలు తక్కువ వడ్డీతో ఇప్పిస్తున్నామన్నారు. రైతు సంఘాలు సమావేశాల ద్వారానే లావాదేవీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ గంగాధరం, రైతు మిత్ర జనమేజయుడు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దయనీయ స్థితి నుంచి.. డైరెక్టర్



- పోరంబోకు అనుకున్న చోటే..
- ఊరందరిచేతా ప్రశంసలు
- తెలుగుతో పాటు తమిళం, కన్నడ సినిమాలకు దర్శకత్వం


డైరెక్టర్ శ్రీనివాస్

రామసముద్రం, నవంబరు 4: చిన్నతనంలోనే సినిమాలపై మోజుతో బడి ఎగ్గొట్టేవాడు. దర్శకుడు కావాలని కలలు కనేవాడు. కూలిపనులతో జీవనం సాగించే కుటుంబం కావడంతో.. బతక డానికి ముద్ద దొరకని దయనీయ స్థితి అయినా.. మొండిగా ముందుకెళ్లి ముళ్లబాటను పూలబాటగా మార్చుకున్నాడు. పోరంబోకు అని ముద్రపడ్డ ఊరిలోనే.. అందరి చేతా ప్రశంసలు అందుకున్నాడు. ఆయనే సినిమా డైరెక్టర్ శ్రీనివాస్. ఇందుకు సంబంధించి వివరాలు శ్రీనివాస్ మాటల్లోనే..

మొదటి సినీ గురువు తక్కాలి శ్రీనివాసన్..

డిప్లమా పూర్తి చేసిన తర్వాత తమిళ డైరెక్టర్ తక్కాలి శ్రీనివాసన్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. శ్రీనివాసన్ డైరెక్షన్‌లో అప్పటికే 499 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న అగ్ని సీరియల్‌కు 500 ఎపిసోడ్‌కు నేను మొదటిసారి డైరెక్టర్‌గా వ్యవహరించాను. ఇందుకుగాను నాకు రూ.50వేలు పారితోషకం ఇచ్చారు.

పోరంబోకు డైరెక్టర్‌గా..

తమిళంతో పాటు తెలుగులో చాలా సినిమాలకు పనిచేశాను. తెలుగులో కొన్ని హిట్ సినిమాలకు కథా సహకారం అందించాను. తెలుగులో మొట్టమొదట పోరంబోకు సినిమాకు డైరెక్టర్‌గా పనిచేశాను. ఆ తర్వాత వరుసగా నిను చూడక నేనుండలేను, భూతం సినిమాలకు డెరెక్షన్ చేశాను. తమిళంలో లొడుకు పాండి, కన్నడంలో కరోడపతి సినిమాలకు దర్శకత్వం వహించాను. ఇప్పుడు ఊరికొక్కడు సినిమా షూటింగ్ పూర్తి అయి విడుదలకు సిద్ధమవుతోంది.


పోరంబోకు సినిమా షూటింగ్‌లో డైరెక్టర్ శ్రీనివాస్

బడి ఎగ్గొట్టి సినిమాలకు..

రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీలో కూలి పనులు చేస్తూ జీవనం సాగించే నాగమ్మ, గెవప్ప దంపతులకు నలుగురు కుమారులు. అందులో నేను నాలుగవ వాడిని. నాకు చిన్నతనం నుంచి సినిమాలంటే మక్కువ ఎక్కువ. ఊరిలో ప్రాథమిక విద్య అయిన తర్వాత రామసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేరాను. అయితే సినిమాల మోజుతో క్లాసులు ఎగ్గొట్టి మండల కేంద్రంలోనే ఉన్న థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవాన్ని. ఇది గమనించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నన్ను పలుమార్లు మందలించారు.

సేవా కార్యక్రమాలలో శ్రీనివాస్

సినిమా డైరెక్టర్ శ్రీనివాస్ సొంత ఊరికి వచ్చినప్పుడు.. ఊరిలో పారిశుధ్యం పనులు స్వయంగా చేపట్టి అందరికి ఆదర్శంగా ఉంటున్నారు. అలాగే గ్రామ ప్రజల ఆరాధ్య దైవం అయిన గెవితిమ్మరాయస్వామి వారి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులతో కలిసి తన వంతు కృషి చేస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ పనైనా సాధించవచ్చని.. ఇందుకు శ్రీనివాస్ నిదర్శనం అని గ్రామస్తుల నుంచి అభినందనలు పొందుతున్నారు.


నిను చూడక నేనుండలేను సినిమా షూటింగ్ చేస్తున్న శ్రీనివాస్

ఇంట్లో చెప్పకుండా చెన్నై..

బడికి వెళ్లడం చదువుకోవడం నాకు కష్టంగా ఉండేది. ఎంతసేపూ సినిమాలే.. దీంతో ఇక చదువు వద్దనుకుని తొమిదవ తరగతి చదువుతున్న సమయంలోనే తల్లిదండ్రులకు తెలియకుండా చెన్నై వెళ్లిపోయాను. చేతిలో చిల్లిగవ్వ లేని స్థితి. రోడ్డుపక్క పడుకునే వాడిని. ఏది దొరికితే అది తినేవాడిని. సినిమా ఇండస్ట్రీపై మోజుతో ఎన్నో తిండిలేని నిద్రలేని రాత్రులు గడిపాను. బతకడానికి చిన్నాచితక పనులు చేసుకుంటూ.. సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగేవాడిని. ఇంత దయనీయ స్థితిలోనూ చెన్నైలోని ఆడియార్‌లో డిప్లమా ఇన్ ఫిల్మ్ టెక్నాలజీ పూర్తి చేశారు. అది నా కల సాకారానికి, పురోగతికి పునాదిరాయిగా మారింది. డిప్లమా పూర్తి అయిన తర్వాత జన్మనక్షత్రం సినిమాకు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసినందుకు ఐదువందల రూపాయల పారితోషకం ఇచ్చారు. ఇదే నా మొదటి పారితోషికం.


లొడుకు పాండి సినిమా షూటింగ్‌లో..

గంజాయి విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

- 5.7 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణమోహన్


వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.. సోమవారం రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. గత నెల 26న రాయచోటి పట్టణంలోని నాయబ్‌సాబ్ వీధికి చెందిన షేక్.జమాల్ బాషా అలియాస్ జమాలుల్లాను అరెస్టు చేసి అతనినుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితులుగా ఉన్న షేక్. మహబూబ్‌జాన్, షేక్. అమ్మాజీ, షేక్.ఫకృన్నీసాతోపాటు, అనంతపురం పట్టణం ఇందిరానగర్‌కు చెందిన రహమత్‌జాన్, షేక్ సోనూను స్థానిక బండ్లపెంట దివానా సాహెబ్ దర్గా సమీపంలో అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో షేక్ మహబూబ్‌జాన్, రహమత్‌జాన్ అలియాస్ హాజీ రహంతుల్లా ఒక తల్లి పిల్లలని తెలిపారు. షేక్.రహమత్‌జాన్ ఆమె కుమార్తె సోనూ కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి కిలో రూ.13 వేలతో కొనుగోలు చేసి గంజాయి తెప్పిం చుకొని ఒక కేజీ గంజాయి రూ.13 వేలు చొప్పున కొనుగోలు చేసి మిగిలిన వారికి రూ.15 వేలకు విక్రయించేవారని తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంతో పాటు, గంజాయిని రికవరీ చేయడంలో చొరవ చూపిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ ఇన్‌చార్జి రవిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలి : పీడీ



జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపర్చాలని మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో రాజంపేట, మదనపల్లె, రాయచోటి పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మెప్మా సిబ్బందికి, రీసోర్స్‌పర్సన్ లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అప్పులు, పొదుపు వివరాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమాచారాన్ని అందులో పొందుపరుస్తారన్నారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేలా ఆర్థిక ప్రణాళికలను తయారు చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి నెల మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో టీఈలు, సీఎంఎంఎస్‌లు, సీవోలు, డీఈవో, డీఆర్‌పీ, టీఎల్‌ఎఫ్ ఆర్‌పీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి


మృతుడు కొళ్ల రెడ్డెప్ప

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు నడపడంలో అతి వేగం, పూర్తి అజాగ్రత్త, రాంగ్ రూట్ డ్రైవింగ్ కారణంగా ఒక వ్యక్తి మృత్యువు పాలయ్యాడు. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కొత్తగజ్జలవారిపల్లె సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకిపురం గండబోయనపల్లె పంచాయతీ కొండకింద మేకలవారిపల్లె గ్రామానికి చెందిన కొళ్ళ రెడ్డెప్ప (40) ఆవుల కొనుగోలు నిమిత్తం ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి కలకడకు బయలుదేరాడు. వేకువ జామున 4.15 గంటల ప్రాంతంలో మండలంలోని కొత్తగజ్జలవారిపల్లె సమీపంలోకి రాగానే ఎదురుగా కలకడ వైపు నుంచి వస్తున్న ఫోర్డ్ ఫియాగో కారు అతి వేగంగా రెడ్డెప్ప మోటారు సైకిలును ఢీకొట్టింది. దీంతో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు పూర్తి అజాగ్రత్తగా, రాంగ్ సైడ్ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడని సీఐ వివరించారు. సుండుపల్లెకు చెందిన రవీంద్ర నాయుడు ఈ కారును నడుపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే మృతుని భార్య కొళ్ల మమత బంధువులతో కలిసి రెడ్డెప్పను కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రెడ్డెప్పకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీఐ ఆదేశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


మృతి చెందిన చిన్నరాముడు

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఒ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన తుపాకుల చిన్నరాముడు(45)గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు, ఈ క్రమంలో చెరువు లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక నీటిలో మునిపోయాడు. అక్కడే వున్న గ్రామస్థులు రాముడు నీటిలో మునిగిపోవడం గమనించి కుంటుంబ సభ్యలకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు చెరువులోకి దూకి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడు భార్య జయమ్మ పిర్యాదు మేరకు పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్‌లు


అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌నాయుడు, జాబీర్, హరిప్రసాద్

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజా ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఇందులో గౌర వాధ్యక్షుడిగా సుధాకర్‌నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. శివారెడ్డి, అసోసియేట్ మహిళా ప్రెసిడెంట్ కె.హేమలత, ట్రేజరర్ బి.చంద్రశేఖర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నకున్నారు. జిల్లాకు పదిమంది కార్యదర్శులను మిగతా సభ్యులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పురం వెంకటరమణ, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కింద పడి కార్మికుడి మృతి

పీలేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం చేస్తున్న ఓ భవని నిర్మాణ కూలీ మూడవ అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మరణించిన సంఘటన సోమవారం పీలేరులో జరిగింది. పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన పి.ఇబ్రహీం(48) స్థానికంగా భవన నిర్మాణ రంగ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక సైనిక్ నగర్ ప్రాంతంలో పనికి వెళ్లాడు. మూడవ అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన సహచర కార్మికులు అతనిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడప పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా డి. శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో టెక్నికల్ మేనేజరుగా పనిచేస్తున్న శ్రీనివాసులుకు పీఏవోగా పదోన్నతి కల్పించి ఖాళీగా వున్న కడపలో నియమించారు. ఈయనతో పాటు మరో ముగ్గురికి కూడా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత సిలిండర్లపై గందరగోళం !



- మొదటి సిలిండరు తీసుకోవడానికి మార్చి వరకూ గడువు
- పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే
- కుటుంబంలో ఒక్క కనెక్షన్‌కు మాత్రమే అర్హత
- కేవైసీ మాత్రం తప్పనిసరి

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలుపై లబ్ధిదారుల్లో అనేక అపోహలు నెలకొన్నాయి. ఉచిత సిలిండర్ల మంజూరుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు చిన్నపాటివే అయినా లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. వీరి అనుమానాల నివృత్తికి అధికారుల వైపు నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉచిత సిలిండర్ల కోసం బుకింగులు మొదలై ఐదు రోజులు కావస్తున్నా ఈ పథకానికి తాము అర్హులో కాదో అనే విషయంలో కూడా స్పష్టత లేదు. దీనికి తోడు దీపం-1 పథకం లబ్ధిదారులకు మాత్రమే కొత్త పథకం వర్తిస్తుందనే ప్రచారం జరుగుతోంది. అంతేగాకుండా మహిళల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉంటేనే ఉచిత సిలిండర్లు అందుతాయనే అపోహలు కూడా నెలకొన్నాయి. ఇంకో వైపు కేవైసీ తప్పనిసరి అన్న విషయం తెలిసినా, దీన్ని ఎక్కడ చేసుకోవాలో తెలియక చాలా మంది అయోమయంలో ఉన్నారు. గతంలో దీపం పథకం ద్వారా కేవలం మహిళలకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఇప్పుడు తాజా పథకానికి దీపం-2 అనే పేరు పెట్టడంతో ఇది కూడా మహిళలకే పరిమితమనే ప్రచారం జరుగుతోంది. మరో వైపు కేంద్రం గతంలో ఉజ్వల పథకం కింద కూడా పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే మరో వైపు పేదలందరికీ ఉచిత సిలిండర్లు ఇవ్వకుండా ప్రభుత్వం మాట తప్పిందని ప్రతి పక్షాలు ప్రచారం మొదలెట్టాయి. గత వైసీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల అర్హతకు సంబంధించి ఆరేడు నిబంధనలు అమలు చేసింది. దీంతో అర్హత ఉన్నా చాలా మంది పేదలకు ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు. రేషన్ కార్డు ఉంటే చాలు.. ఉచిత సిలిండర్లకు అర్హులైనట్లేనని మరో వైపు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ కోవలో అయితే చాలా మందికి ఉచిత సిలిండర్లు దక్కే పరిస్థితి లేదు. సడలించిన నిబంధనలతో కొత్త రేషన్ కార్డులు జారీ అయితేగానీ దీనికి పరిష్కారం లభించదు. మరో వైపు జనవరిలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

డాక్యుమెంట్లు సమర్పించాలన్న మరో పీటముడి

కేవైసీపై గురించే లబ్ధిదారుల్లో గందరగోళం ఉండగా.. సిలిండరు బుక్ చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ మంజూరు పత్రం అప్‌లోడ్ చేయాలని చెపుతున్నారని లబ్ధిదారులంటున్నారు. దీని కోసం ఇంటర్నెట్ కేంద్రాలకు వెళితే వందల్లో రుసుము వసూలు చేస్తారని, అన్నీ లెక్కిస్తే ఉచిత సిలిండర్ ధరకు సరిపోతుందనే విమర్శలున్నాయి. అలా కాకుండా అర్హులైన వారికి శాశ్వతంగా గుర్తింపు కార్డులు జారీ చేస్తే సరిపోతుంది కదా అని సూచిస్తున్నారు.

ఉచిత సిలిండర్‌కు అర్హులెవరంటే..

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం అర్హులెవరనే దాని పైన అధికారులు ఇప్పుడిప్పుడే వివరణలు ఇస్తున్నారు. కుటుంబంలోని పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నాగానీ ఉచిత పథకానికి అర్హులుగానే చెపుతున్నారు. ఒక వేళ భార్య పేరుతో రేషన్ కార్డు ఉండి భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులవుతారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటున్న కారణంగా ఒక రేషన్ కార్డుకు ఒక గ్యాస్ కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంటుంది. ఉచిత సిలిండర్ల కోసమైతే ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు తప్పనిసరి. బ్యాంకు ఖాతాకు, రేషన్ కార్డుకు, గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి. అదనంగా మొబైల్ నంబరు కూడా కలిగి ఉండాలి. గ్యాస్ కనెక్షన్ మంజూరయిన వ్యక్తి ఆ కుటుంబ రేషన్ కార్డులో తప్పనిసరిగా ఉండాలి. ఒకే రేషన్ కార్డులోని ఇద్దరు ముగ్గురు పేరుతో గ్యాస్ కనెక్షన్‌లుంటే ఉచిత సిలిండర్ పథకం మాత్రం ఒకరికే వర్తిస్తుంది. ఇందులో ఏ కనెక్షన్‌కు ప్రాధాన్యమిస్తారన్న విషయంలో స్పష్టత రావలసి ఉంది. పాతికేళ్ల క్రితం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం దీపం పథకం పేరుతో ఇచ్చిన ఉచిత గ్యాస్ కనెక్షన్లతో పాటు కేంద్రం మంజూరు చేసిన ఉజ్వల పథకానికి కూడా దీపం-2 (ఉచిత సిలిండర్ పథకం) వర్తిస్తుంది. గ్యాస్ బుకింగ్ ఆన్‌లైన్‌లో లేదా డీలర్ వద్ద చేసుకోవచ్చుగానీ వాటికి అవసరమైన డాక్యుమెంట్ల విషయంలో ఎవరికీ స్పష్టత లేదు. సిలిండర్‌కు డెలివరీ సమయంలో నగదు చెల్లించిన అనంతరం గ్యాస్ కంపెనీ నుంచి రెండు రోజుల్లో ఆ డబ్బు తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుంది.

అవసరమైన అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని పథకం ప్రారంభించి ఉంటే బాగుండేదనే విమర్శలున్నా మొదటి సిలిండర్ పొందడానికి ఐదు నెలలు (వచ్చే ఏడాది మార్చి వరకూ) గడువు ఉన్నందువల్ల తొందరపడాల్సిన అవసరం లేదని అధికారులు సర్దిచెపుతున్నారు. ఇందులో ఏవైనా సందేహాలుంటే నివృత్తి కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

కేవైసీ ఎక్కడ చేయించుకోవాలి..?

ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు.. ఇలా నాలుగు ఉంటేనే ఉచిత సిలిండర్లకు అర్హతగా ప్రభుత్వం పేర్కొంది. ఈ నాలుగూ ఉన్నా చివరికి కేవైసీ తప్పనిసరి అంటున్నారు. కేవైసీ అంటే నో యువర్ కస్టమర్ అని అర్థం. ఇక్కడ ఉచిత సిలిండర్ల లబ్ధిదారులు మూడు స్థాయిల్లో కేవైసీకి ప్రయత్నించాల్సి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే కేవైసీ అంటే ఎక్కడ చేసుకోవాలి? అకౌంటుకు సంబంధించి బ్యాంకులోనా, రేషన్ కార్డుకు సంబంధించి చౌక దుకాణంలోనా, గ్యాస్ కనెక్షనుకు సంబంధించి గ్యాస్ డీలరు వద్దనా, ఆధార్ కార్డుకు సంబంధించి ఆధార్ నవరణ కేంద్రంలోనా.. అనే అంశాలపై లబ్ధిదారులకు స్పష్టత ఇచ్చేవారు కరువయ్యారు. దీనికి సంబంధించి అధికారులు కూడా సూటిగా చెప్పలేకపోతున్నారు. ఈ అంశాలు కూడా ప్రజల్లో గందరగోళానికి కారణమవుతున్నాయి.

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్‌ల మూత

- బయట ఫుడ్ కోసం ఆర్డర్లు
- యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం
- నిరసనకు దిగుతున్న విద్యార్థులు

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. వేంపల్లెలో ఆర్డర్ చేసుకొని రాత్రి 10, 11 గంటలకు కూడా బయటి ఫుడ్ తీసుకుంటుండడంతో ట్రిపుల్‌ఐటీ యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మాకు బయటి ఫుడ్ కావాలంటూ విద్యార్థులు ఆది, సోమవారాల్లో రాత్రిపూట కొంతసేపు నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఉన్న ఐదు క్యాంటీన్లు గత నెలలో రద్దు చేయడంతో మూతపడ్డాయి. ఆ క్యాంటీన్లు ఉన్న సమయంలో మెస్‌లో తినని విద్యార్థులు క్యాంటీన్లకు వెళ్లితినేవారు. ప్రస్తుతం మూతపడడంతో బయట ఫుడ్ ఆర్డర్ చేస్తూ ట్రిపుల్ ఐటీకి తెప్పించుకుంటున్నారు. రాత్రి 11 వరకు తెప్పించుకుంటుండడంతో ట్రిపుల్‌ఐటీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 8 లోపు తెప్పించుకోవాలని సూచించడంతో అప్పటికే ఆర్డర్లు ఇవ్వడం వల్ల బయటిఫుడ్ మాకు ఇవ్వాల్సిందేనని నిరసన తెలిపారు. అప్పటికి సర్దిచెప్పి ఫుడ్‌ను ఇప్పించి పంపించారు. రోజు రాత్రివేళల్లో ఇదే పరిస్థితి తలెత్తుతోంది. ట్రిపుల్‌ఐటీలో వెంటనే క్యాంటీన్లను ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసర ఎంతైనా ఉంది. ఈ విషయాన్ని డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకెళ్లగా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటవుతాయని తెలిపారు. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

మెస్‌లలో సక్రమంగా ఉండడం లేదా...

ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు మెస్సుల్లో తినకుండా క్యాంటీన్లకు ఎగబడడం, అవి లేకపోవడంతో బయటినుంచి ఫుడ్ తెప్పించుకుంటుండడంతో మెస్‌లలో ఫుడ్ సక్రమంగా ఉండడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెస్సులపై ఫిర్యాదులు రావడంతో ఇప్పటటికే రద్దు చేశారు. వాటినే తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆర్జీయూకేటీ సిద్ధమవుతోంది. మెస్‌లలో నాణ్యమైన ఆహారం అందిస్తే విద్యార్థులు క్యాంటీన్ల వైపు మొగ్గుచూపరు కదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆ విధంగా ట్రిపుల్‌ఐటీ యాజమాన్యం విద్యార్థులకు మంచి ఆహా రం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.



ప్రశాంతంగా ముగిసిన గెస్ట్‌ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు



కడప(ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలో వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, ప్రొఫెసరు దాము, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ కర్నూలు రాయలసీమ యూనివర్శిటీ ప్రొఫెసరు విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసరు శ్రీదేవి, ప్రొఫెసరు విజయభారతి, డాక్టర్ శ్రీధర్‌బాబు, డాక్టర్ రమణ, సుభాష్‌చంద్ర, డాక్టరు శ్రీనివాసరావు ఇంటర్వ్యూల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయని.. ప్రతిభతో పాటు పీహెచ్‌డీ, నెట్ అర్హత ఉన్న వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు.

గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయం



డీఆర్వో గంగాధర్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. డీఆర్వో బాపట్ల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయనకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ అధికారిగా విశేష సేవలు అందించి, అందరు ఉన్నతాధికారుల మన్ననలను పొందారన్నారు. ఆయన బదిలీపై వెళ్లడం బాధాకరమని, కానీ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలం పని చేయడం అదృష్టమన్నారు. రెవెన్యూ అధికారులందరి సహకారంతో పనిచేయగలిగామన్నారు. బదిలీపై వెళుతున్న ఆయనను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, విజయకుమార్, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, వెంకట్రావు, ఆర్డీవోలు, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు4 (ఆంధ్ర జ్యోతి): సరిగా వ్యాధి నిర్ధారణ చేయకుం డానే ఆపరేషన్ చేసి ఆమె మృతికి కారణం కావడంతోపాటు, ప్రశ్నించిన బంధు వులపై దాడి చేసిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్య లు తీసుకోవాలని మృతురాలి కుమారుడు, బంధువులతో కలసి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టీఎల్ వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమ వారం కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత నెల 30న చికిత్స నాగేశ్వర అనారోగ్యంతో ఉన్న తన తల్లిని పీలేరు ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, సమస్య ఏదో సరిగ్గా గుర్తించకుండా పలురకాల పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ చేశారన్నారు. దీంతో ఆమె కోలుకోకపోగా, ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో మదనపల్లె మోడ్రన్ హాస్పిటల్‌కు పంపించారన్నారు. అక్కడ ఎటువంటి చికిత్స చేయకుండా సమయం వృథా చేయడంతో ఆమె మృతి చెందిం దన్నారు. దీంతో బంధువులు ఆమె మృతదేహాన్ని తీసుకుని తిరిగి ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు వెళ్లగా యాజమాన్యం వారిపై దౌర్జన్యం చేసిందన్నారు. ఈవిషయంపై స్పందించిన కలెక్టరు విచారణ కు ఆదేశించారన్నారు. అయితే, విచారణ అధికారి సైతం హాస్పిటల్ యాజ మాన్యంతో పాటు, పీలేరు ప్రభుత్వ డాక్టర్లతో కలిసి ఏకపక్షంగా చేసినట్లు కలెక్టర్‌కు వివరించడంతో ఆయన మరోసారి విచారణకు ఆదేశించారని తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్టు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాల పెంటకు చెందిన ఫిర్దోస్ అనే మహిళ భర్త వేధింపులు తాళలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త కరీముల్లాను సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 17సంవత్సరాల క్రితం ఫిర్దోస్‌ను కరీముల్లా పెళ్లి చేసుకన్నాడు. గత కొంతకాలంగా భార్యను శారీరక మానసికంగా వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు నిందితుడు కరీముల్లాను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

'ఎస్‌ఐ చితక్కొట్టాడు'

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలో మట్టి పోస్తుండగా ఇరువురు కానిస్టేబుళ్లు వచ్చి తనను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారని.. తనను చూసిన వెంటనే ఎస్‌ఐ చితక్కొట్టాడంటూ బాధితుడు జయశంకర్ వాపోయాడు. బాధితుడి వివరాల మేరకు...

పెండ్లిమర్రి మండలం నందిమండలం బస్టాండు వద్ద 18ఏళ్లక్రితం స్థలం కొనుగోలు చేశామని.. అయితే తమ స్థలం పక్కనే నాగేంద్రకు చెందిన స్థలం ఉందన్నారు. ఆదివారం నా స్థలంలో మట్టి వేసుకుంటుండగా నాగేంద్ర పోలీసులకు ఫిర్యా దు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ వచ్చి తనను తీసుకెళ్లగా.. ఎస్‌ఐ విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడన్నారు. పేపర్లు పరిశీలించాలని కోరినా వినిపించుకోలేదన్నారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదనరెడ్డిని వివరణ కోరగా.. నాగేంద్ర ఇంటి పక్కన ఉన్న స్థలంలో మట్టిపోయయడంతో తమకు ఫిర్యాదు చేశాడన్నారు. అతన్ని పిలిపించి స్థలం వద్ద గొడవ పడకూడదని.. ఏదైనా ఉంటే తహసీల్దారుకు ఆ స్థలం వివరాలు ఇవ్వాలని కోరుతామని చెప్పి పంపించామే తప్ప అతనిపై ఎలాంటి దాడి చేయలేదన్నారు.

సీఎంపై అసభ్య పోస్టింగులు.. ఇరువురిపై కేసు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగులు పెట్టిన ఇరువురిపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన శ్రీనివాసులు మరో వ్యక్తి కలిసి సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, లోకేశ్‌లపై పోస్టింగులు చేశారు. దీంతో టీడీపీనేత తిరుమలేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇరువురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నమస్తేబోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కిశోర్ (16) అనే బాలుడు మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన కిశోర్ స్కూటీలో వెళుతుండగా మరో వాహనం వచ్చి ఢీకొట్టడంతోతీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడు అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మృత్యుంజయకుంట చెందిన మణికంఠ అనే బాలుడు అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మణికంఠ మరో నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం బాలుడి తండ్రి ఓబులరాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా మణికంఠతో పాటు వెళ్లిన పిల్లలను విచారించగా చెన్నూ రు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లగా మణికంఠ నీటి లో మునిగిపోయి గల్లంతైనట్లు అధికారుల దృష్టికి తీసకువచ్చారు. మణికంఠ నగరంలోని ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. గల్లంతైన మణికంఠ కోసం పోలీసులు గాలిం పు చర్యలు చేపట్టనున్నారు.

యువతి అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ఇక్బాల్ రైస్‌మిల్లు సమీపంలో యువ తి సోమవారం అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తేజస్విని ఇంటర్ పూర్తి చేసి డాక్టరు కోర్సు కోసం ఇంట్లో ఉండి చదువుకుంటోంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

స్వల్ప ఆధిక్యత సాధించిన శ్రీకాకుళం

- భారీ స్కోరు దిశగా నెల్లూరు, గుంటూరు జట్లు

కడప స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్‌బి మల్టీడే క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా సోమవారం శ్రీకాకుళం జట్టు అనంతపురం జట్టుపై 26 పరుగుల స్వల్ప ఆధిక్యత సాధించింది. అలాగే నెల్లూరు జట్టు క్రిష్ణా జట్టుపై 246 పరుగులు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయనగరం జట్టుపై 313 పరుగులు భారీ స్కోరు సాధించింది. వివరాలిలా..

నగర శివారు ప్రాంత కేవోఆర్ఎం మైదానంలో అనంతరం-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచకున్న అనంతపురం జట్టు మొదటి రోజు 45.1 ఓవర్లలో 130 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో సాత్విక్ 5 వికెట్లను పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 156 పరుగులు సాధించింది. ఇందు లో ఎం.కిరణ్ 77 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. కాగా మరో బ్యాట్స్‌మెన్ వివేకానంద 62 పరుగులు చేశాడు. దీంతో శ్రీకాకుళం జట్టుకు 26 పరుగుల ఆధిక్యత లభించింది. నగర రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్‌స్టేడియంలో క్రిష్ణా-నెల్లూ రు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన క్రిష్ణా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 246 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఇందులో సుశాంత్ 67 పరుగులు, సాయి యశ్వంత్ 51 పరుగులు సాధించారు. కేఎస్ఆర్ఎం మైదానంలో విజయనగరం- గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన విజయనగరం జట్టు ఫీల్డింగ్ ఎంచకోగా గుంటూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 89.3 ఓవర్లలో 313 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌట్ అయ్యింది. ఇందులో కౌశిక్ 151 పరుగులు సాధించడం విశేషం.

'అ'.. ఆయనా..!

- నీటిపారుదలశాఖలో హల్‌చల్
- లోకేశ్ ఫ్రెండ్ అంటూ ప్రచారం
- చక్రాయపేటలో ఇల్లు కూల్చారనే నెపంతో..
- ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వని వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్న పనికావాలన్నా.. నీటిపారుదలశాఖ కార్యాలయంలో వాచ్‌మాన్ తలుపు తెరవాలన్నా ఒకాయన పేరే వినిపిస్తుంది. ఆయనే 'అ' అనే అక్షరంతో మొదలయ్యే పేరున్న వ్యక్తి. మొన్నటి వరకు కనీసం అడ్రస్ లేని వ్యక్తి ఇప్పుడు కడపలో ప్రముఖమైన వ్యక్తిగా మారాడంటారు. ఉద్యోగం కావాలన్నా, బదిలీ కావాలన్నా, ఏదైనా పదవి కావాలన్నా.. ఆఖరుకు ఏదైనా సిఫారసు అయినా సరే.. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ ఎలా కుట్టదంటారో అలా.. 'అ' ఆజ్ఞ లేనిదే అటు పాలిటిక్స్, ఇటు అధికార యంత్రాగంలో పని జరగదంటారు. ఎలా అంటే ఈయన మంత్రి నారాలోకేశ్, సీఎం చంద్రబాబు పేరు చెప్పుకోవడంతో పాటు కడప ముఖ్య నేత అనుచరుడని చెప్పుకుంటూ ముఖ్యంగా నీటిపారుదలశాఖలో హవా కొనసాగిస్తున్నారు. ఒక ఇన్‌చార్జి ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వకుండా అడ్డుకున్నాడంటే 'అ' పవరేమిటో అర్థమవుతుంది.

ఈఈని అడ్డుకున్నారు

ఆయనకు ఉండే బ్యాక్‌గ్రౌండ్ ఏందంటే టీడీపీ కేడరుగా ఉంటూ లోకేశ్ పాదయాత్రలో పాల్గొనడం. దీనికి తోడు ఇప్పుడు కడపను ఏలుతున్న ముఖ్య నేత సామాజిక వర్గం కావడంతో ఆయన ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. వామ్మో.. వైసీపీ నేతలే మేలన్న స్థితికి ఈయన తీసుకువచ్చారు. కడప మైనర్ ఇరిగేషన్ ఈఈ బాల చంద్రారెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య డివిజనులో పనిచేస్తున్న మురళీక్రిష్ణ ఈఈగా వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లగా చక్రాయపేటకు చెందిన కడపలో రుబాబు చేస్తున్న 'అ' అనే వ్యక్తి అడ్డుకున్నట్లు చెబుతారు.

చెరువులో కట్టారని..

చక్రాయపేట మండలంలోని ఓ చెరువులో అక్రమ కట్టడాలు అంటూ 2019లో జగన్ ప్రభుత్వం 'అ' ఇంటిని కూల్చింది. అప్పట్లో జగన్ కుటుంబీకులు చెప్పిందే వేదం. రాష్ట్రానికి జగన్ సీఎంగా ఉన్నప్పటికీ జిల్లాకు అంతా పులివెందుల నేతలే సుప్రీంగా వ్యవహరించారు. ముఖ్యంగా చక్రాయపేటకు కొండారెడ్డి చెప్పిందే ఆజ్ఞ అంటారు. అప్పట్లో పై నుంచి వచ్చిన ఆదేశాలు, రెవెన్యూ అధికారుల రిపోర్టు మేరకు 'అ' ఇల్లు కూలగొట్టారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో.. తన ఇంటిని కూలగొట్టిన ఇరిగేషన్ అధికారులపై ఆయన పగబట్టినట్లు చెబుతారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు 'అ' ఇంటిని కూలగొట్టిన టీంలో ఉన్న మురళీకృష్ణ ఇప్పుడు ఈఈగా రాగా విధుల్లో చేరనివ్వకుండా ఆయన అడ్డుకున్నారు. మీరు అప్పుడు ఇల్లు పగలగొట్టారు, నాకు నష్టపరిహారం ఇవ్వండి అంటూ ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులను 'అ' డిమాండ్ చేస్తున్నారంటారు. టీడీపీకి చెందిన ముఖ్య నేత కూడా ఆయనతో మాట్లాడుకుని సెటిల్ చేసుకోవాలంటూ అధికారులకు సలహా ఇస్తుండడమే ఇప్పుడు చర్చగా మారింది.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాముకాటు



పాఠశాలలో పామును చంపిన దృశ్యం, పాముకాటుకు గురైన వర్షిణి, పల్లవి

కొండాపురం, నవ ంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురయ్యారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతి వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలో నిద్రిస్తున్న మోటుపల్లి పల్లవి, కోగటం వర్షిణి అనే ఇద్దరు 8వ తరగతి విద్యార్థినులను పాము కాటేసింది. దీంతో ఏదో కుట్టిందని.. అక్కడే వారితోపాటు ఉన్న పీడీ కాటమ్మకు తెలియజాశారు. దీంతో పాఠశాలలోని హెల్త్‌సూపర్‌వైజర్‌తో చెకప్ చేయించారు. ఎలుకలు కరిచినట్లు అనుమానంతో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ప్రొద్దున్నే 6 గంటల ప్రాంతంలో డార్మెంటరీలో పిల్లలు బ్రష్ చేస్తుండగా పాము కనపడింది. దీంతో పామును సిబ్బంది సహాయంతో చంపేశారు. దీంతో విద్యార్థులకు పాము కుట్టి ఉండవచ్చునన్న అనుమానంతో వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి విద్యార్థిని దగ్గరే ఉండి చికిత్స చేయిస్తున్నారు. కాగా పల్లవి అనే విద్యార్థిని ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో అబ్జర్వేషన్ నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా ప్రస్తుతం ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విషయం తెలుసుకున్న జమ్మ లమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయి శ్రీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విషపురుగులు పాఠశాలలోకి రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ గురప్ప, ఎంపీడీవో నాగ ప్రసాద్, ఎంఈవోలు ఓబులేసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో

ప్రారంభమైన సెమిస్టరు పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో బీఈడీ కళాశాలల 2, 4 సెమిస్టరు పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలకు సంబంధించి 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తనిఖీలు నిర్వహించారు. కడప నగరంలో ఎస్వీ బీఈడీ కళాశాల శ్రీహరి బీఈడీ కళాశాలల కేంద్రాలో విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని.. ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలు రాసే ఏర్పాట్లు చేయాలని సూచి ంచారు. ప్రతి కేంద్రం నుంచి అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని హైపవర్ కమిటీ ప్రతినిధులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. హైపవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసరు సునీత, రియాజున్నీసా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పాపాఘ్నిలో ఇసుకను తోడేస్తున్నారు

- నది వద్ద రైతుల ధర్నా

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించడంతో వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను విచ్చలవిడిగా తోడేస్తున్నారు. యథేచ్ఛగా వాహనాల్లో తరలుతున్న ఇసుకపై పాపాఘ్ని పరివాహక భూముల రైతులు ఆందోళనకు గురై సోమవారం నిరసనకు దిగారు. పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డగించి ధర్నా చేశారు. అక్కడే బైఠాయించారు. ఇసుక యథేచ్ఛగా తరలిపోతే భూగర్భజలాలు అడుగంటి ప్రజలకు తాగునీరు ఉండవని, నీళ్ల వచ్చినపుడు భూములు కోతకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, తహశీల్దార్‌కు తెలియజేశారు. రైతులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపి ఆందోళన చేశారు. అక్కడున్న ట్రాక్టర్లను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుకను అవసరమైన వారు ఉచితంగా రీచ్‌లలో తెచ్చుకోవాలని, ఇతర అవసరాల కోసం వస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హరినాథరెడ్డి వారిని హెచ్చరించి పంపించేశారు.



వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి నిరసన తెలుపుతున్న రైతులు

రిమ్స్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అన్నదానం

- కందుల చంద్ర ఓబుళరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం ప్రతి మంగళ, శుక్రవారాల్లో రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహిస్తామని విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కందుల శివానందరెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి రక్తదాన శిబిరం, భగవద్గీత పారాయణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్‌సెట్ 2024 ద్వారా కేఎస్ఆర్ఎం కళాశాలలో మెరిటోరియస్ విద్యార్థులకు, కేజీసెట్ 23 స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, మొత్తం 38 మంది విద్యార్థులకు విద్యలో కొనసాగడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రిమ్స్‌లో సదరం సర్టిఫికెట్లు, అనారోగ్యంతో వచ్చే వారికి 350 మందికి అన్నదానం, మంచినీరు అందిస్తామన్నారు. వైస్‌చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కందుల శివానంద రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని, ప్రజలకు ఉచిత మంచినీటి సరఫరా, ఉచిత భోజ నం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన మరుపురాని మనిషి అన్నారు. ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, చైర్మన్ రాజమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ టీఎస్‌ప్రసాద్, కేఎస్ఆర్ఎం ప్రిన్సిపల్ రత్నమ్మ, కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీ ప్రిన్సిపల్ నాగమణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనితకు ఎమ్మెల్యే ఘనస్వాగతం



మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత కు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిసి ఘనస్వాగతం పలికారు. సోమవారం చిత్తూరు నుంచి అనంతపురంకు వెళుతున హోంమంత్రిని పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డులో ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువతో సన్మానించారు. మదనపల్లె పట్టణంలోకి రావాలని అహ్వానించగా, మరోసారి తప్పకుండా వస్తానని హోం మంత్రి ఎమ్మెల్యేతో అన్నారు.

కరువు మండలాలుగాప్రకటించాలి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావంతో ఉన్న ములకలచెరువు, పెద్దమండ్యం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున కలెక్టర్ శ్రీధర్‌ను కోరారు. ఆ మేరకు జిల్లా కేంద్రంలోని రాయచోటిలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు మండలాల జాబితాలో ములకలచెరువు, పెద్దమండ్యంలను చేర్చాలని కోరారు.

హరహర మహాదేవ

- కార్తీక మాస తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- పరమేశ్వరుడికి అభిషేక పూజలు విశేష అలంకరణలు
- కార్తీక దీప కాంతుల వెలుగులు



పీలేరు శివాలయంలో మహిళలతో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరింపజేస్తున్న ఆలయ అర్చకులు



పీటీఎం శివాలయంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు



కలకడ సిద్ధేశ్వరుని సన్నిధిలో భక్తులు



వాల్మీకిపురంలో లక్ష్మీకామేశ్వరస్వామి

పీలేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి: కార్తీక మాసం మొదటి సోమవారం హరహర మహాదేవ అంటూ శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా పీలేరులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, శివరామపురంలోని భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి, అడవిపల్లెలోని మద్దుండాల మల్లేశ్వర స్వామి, జంగంపల్లెలోని వీరభద్ర స్వామి ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.. తొలి సోమవారం సంద ర్భంగా ఆయా ఆలయాల్లో ఆలయ నిర్వాహకులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున వేకువ జామునే ఆలయాలకు చేరుకుని స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు విరూపాక్షం కుమారస్వామి మహిళలతో కేదార గౌరీ వ్రతాన్ని ఆచరింపజేశారు. వ్రతం అనంతరం చాలా మంది మహిళలు ఆలయంలోని నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలతో సోమవారం సాయంత్రం ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మా సం మొదటి సోమవారాన్ని పురష్కరించుకుని ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వ ర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి, మహా మంగళరతి నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

కలకడలో: కలకడ కామాక్షి సమేత సిద్ధేశ్వరుడికి మొదటి కార్తీక సోమవారం రోజున అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు సుబ్రమణ్యం స్వామి ఉదయాన్నే స్వామి అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే కలికిరి, కలకడ, సంబేపల్లె మండలాల నుంచి ఆలయానికి భక్తులు హాజరై నోములలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా సోమవారం కార్తీక మాసం తొలి సోమవారం గౌరీ కేదారేశ్వరస్వామి వ్రత వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక కోనేటివీధి శివాలయంలో ఉదయం గౌరీ అమ్మవారికి అభిషేకం, అర్చన, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. గౌరీ కేదారేశ్వరులకు వ్రత వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల విశేష సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కేదారేశ్వరస్వామి నోములు

మదనపల్లె అర్బన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మొదటి సోమవారం సందర్భంగా పలు ఆలయాల్లో కేదారేశ్వరస్వామి నోములు వైభవంగా నిర్వహించారు. చిప్పిలిగ్రామంలోని మడికయ్యల శివాలయంలో కేదారేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కేదారేశ్వరస్వామి నోములు నోచారు. సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయంలో, నీరుగట్టువారి పల్లెలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కేదారేశ్వరస్వామి నోములు చేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త గుడి రామాంజులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

శోత్రియం భూములను పేదలకు పంచాలి

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గూడుపల్లె శోత్రియం భూములను పేదలకు పంచాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. గూడుపల్లె శోత్రియం భూములను పేదలకు పంచడంతోపాటు రైతులకు రూ.20వేలు పంట సహాయం అందిచాలని డిమాండ్ వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, మండల కార్యదర్శి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

రామసముద్రం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని మినికి గ్రామానికి చెందిన గిరిబాబు(37), వనగానిపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి(38) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా వారి వద్ద నుంచి రూ.13,980 విలువ చేసే 24.6లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ తెలిపారు.

నైపుణ్య గణనపై శిక్షణ

రామసముద్రం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల సచివాలయ , ఉపాధి సిబ్బందికి సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో భాను ప్రసాద్ మాట్లాడుతూ 15 నుంచి 59సంవత్సరాలు వయసు గల వారి సమగ్ర డేటాను తీసుకుని వారికి ప్రాంతీయ ఇండస్ట్రీకి అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. ఈ సర్వేకు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహకరించాలని కోరారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని వివిధ సచివాలయాల్లో పని చేసే సచివాలయ ఉద్యోగులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్ కలాం అజాద్ అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ యోగానంద్ ఆయా సచివాలయాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయల నూతన కమిటీలు

మదనపల్లె అర్బన్, నవంబరు4:(ఆంధ్రజ్యోతి) వాల్మీకి బోయలను ఎస్టీ పునరుద్ధరణ కోసం పోరాటాలు చేయడానికి జిల్లా నూతన కమిటీ నియమించినట్లు ఏపీ రాష్ట్ర బోయసంఘం కో కన్వీనర్ నాగినేని గోవిందు తెలిపారు. ఇందులో జిల్లా గౌరవాధ్యక్షులుగా తలారి శ్రీనివాసులు, కొత్తూరు చిన్నరెడ్డెప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మనపల్లె లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా చెన్నం వెంకటరమణ, కార్యదర్శులుగా పారేశి రాజగోపాల్, మేకల లక్ష్మీనారాయణ, పారేశి రెడ్డిభాస్కర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కోటా రమణలు నియమితులయ్యారు.

హామీలను అమలు చేయాలి

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట వలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భగా సాంబశివ, వలంటీర్ల అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు తాము ప్రజలకు సేవలందించామని, ఎన్నికల ముందు వలంటీర్లను ఆదుకుంటామని చంద్రబాబు ఇచ్చిన హామీని అమలుచేయాలనికోరారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీలేరు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు స్థానిక సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కళాశాల పూర్వ విద్యార్థి, కలికిరి జేఎన్టీయూ అధ్యాపకుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పలు రకాల పండ్ల మొక్కలను నాటారు. మొదట సీఆర్పీఎఫ్ డీఐజీ అనుపమ్ శర్మ మొక్కలను నాటి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెరిగి పర్యావరణం కాలుష్య రహితంతోపాటు ఆ చెట్ల ద్వారా పండే పండ్లు ఆహారంగా ఉపయోగపడుతాయని అన్నారు. సీఆర్పీఎఫ్ శిక్షణ సంస్థ కమాండెంట్లు, డిప్యూటీ, అసిస్టెంట్ కమాండెంట్లు, జవాన్లు పాల్గొన్నారు.

సివిల్‌తో మెరుగైన ఉద్యోగాలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ క్లోడిడయాస్

కురబలకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సివిల్ రంగంలో పట్టు సాధిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను పొందవచ్చని రిసోర్సుపర్సన్ క్లోడిడయాస్ పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో నాణ్యత నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో నాణ్యత ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అంతేకాకుండా పరిశ్రమల రంగాల్లో ఎంతో దోహదపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి దీపాంకర్ రాయ్, కో ఆర్డినేటర్ సోనూ కుమార్‌గుప్త పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్ళి వస్తుండగా సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఎనిమిది మంది గాయపడ్డారు. ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు వద్ద బొలెరో వాహనం బోల్తా పడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు....శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లె మండలం గంటపురం గ్రామానికి చెందిన ఎల్లప్ప కుటుంబం బొలెరో వాహనంలో ఆదివారం ఉదయం దైవదర్శనానికి అరుణాచలంకు వెళ్లి దర్శనం అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలోని ములకలచెరువు రైల్వేగేటు వద్ద అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో ఎల్లప్ప(48), ఎల్లమ్మ(45), గాయత్రి(26), ఈశ్వరమ్మ(38), తరుణ్(18), అనీల్(30), శ్రావణి(19), రజిత(20) గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కురబలకోటలో మరో ముగ్గురికి గాయాలు

కురబలకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం రాత్రి మండలంలో జరిగింది. ములకలచెరువు మండలంలోని వడ్డిప ల్లెకు చెందిన ఈశ్వరయ్య (50) సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్ళి వస్తుండగా మార్గ మధ్యంలోని కంటేవారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో బి.క్రొకోటకు చెందిన శంకర్(40), పుంగనూరు జగన్ కాలనీకి చెందిన మునుస్వామి(35)లు గాయపడ్డారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కురబలకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కారు, ద్విచక్ర వాహనదారుడిని ఢీకొన్న ప్రమాదంలో వాహనదారుడు తీవ్రగాయాలైన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని తెట్టు పంచాయతీ ఎనమలవారిపల్లెకు చెందిన అశోక్‌కుమార్(25) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బెంగళూరుకు వెళ్ళి అక్కడ పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతడిని 108సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సల నిమిత్తం తిరుపతికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సారా విక్రేతలు అరెస్ట్

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బండ్లపై పంచాయతి దళితవాడకు చెందిన జి.చెంగప్ప(60), జి.రామలక్ష్మిలు ఇద్దరు గ్రామ సమీపంలో నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి ఇద్దరిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

తంబళ్లపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా మండలంలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని పీఆర్ డీఈ మునిరాజకుమార్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని తంబళ్లపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, రెడ్డికోటల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనులపై ఏఈ హరినాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శేషాద్రి, అలేఖ్యల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలి

- వ్యాపారులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సీటీఎం రోడ్డు వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. సోమవారం స్థానిక సీటీఎం రోడ్డులోని వ్యాపారులు, వాణిజ్య భవనాల యజమానులతో ఎమ్మెల్యే సమావేశమై మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో సీటీఎం రోడ్డు వ్యాపారాలకు ప్రాధానత్య గల ప్రాంతమని ఈ రోడ్డులో భారీ చింత వృక్షాలు రోడ్డు పక్కన ఉండటం, మిగిలిన రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మదనపల్లెకు వచ్చినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్లగా చింత చెట్లు తొలగించేందుకు అటవీశాఖ, ఆర్ అండ్‌బీ అధికారులతో చర్చించి అనుమతులు వచ్చాకే తొలగిస్తున్నామన్నారు. తనకు ఎవరి మీద విభేదాలు లేవని, రోడ్డును వెడల్పు చేస్తామే కాని, వ్యాపారుల భవనాలకు ఎలాంటి నష్టం వాటిళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ కొండయనాయుడు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే పోలీసులు ఒక్కరితోనే సాధ్యం కాదని, ప్రజలు కూడా సహకరించనప్పుడే సమస్య పరిష్కరించవచ్చన్నారు. సీటీఎం రోడ్డులో వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ నిలిచిపోతోందన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ వంక పక్కన పిల్లర్లు వేసి అక్కడ ప్లాట్‌ఫామ్ నిర్మించి వాహనాల పార్కింగ్‌కు స్థలం చూపిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, బాలుస్వామి, వ్యాపారులు విజయలక్ష్మి భాస్కర్, దేవత సతీష్, నంది బాబు, చెన్న కృష్ణారెడ్డి, బ్యాంకు భవనాల యజమానులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలి

- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ/వాల్మీకిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలైన సీసీరోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు, వీధిలైట్ల పరిష్కారానికి నాయకుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెలో ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్ కుమార్, మూర్తిరావు, నౌషాద్, చలమారెడ్డి, ఎల్లుట్ల మురళీ, సుంకర శేఖర్, ప్రదీప్, ఆనంద్, బయ్యారెడ్డి, చంద్రబాబు, నౌషాద్‌అలీ, సుధాకర్, ఎంపీడీవో వెంకటేశులు, తహశీల్దార్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. కాగా వాల్మీకిపురం మండలంలో ఎక్కడా ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అందే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈకార్యక్రమాలలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, గాంధీపేట రమణ, వీవీ నారాయణ, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, అధికారులు పాల్గొన్నారు. కాగా చింతపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండక్కగారి కేశవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, కలకడ మాజీ జడ్పీటీసీ తిరుపతినాయుడు, నాయకులు జగన్నాథ రెడ్డి, నరసింహారెడ్డి, సత్యారెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, చంద్రారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది



గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి అర్జీలు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో రాఘవేంద్ర

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే ప్రజల సమస్యలన్నింటికి ఏదో ఒక పరిష్కారం ఉంటుందని ఇన్‌చార్జి ఆర్డీవో రాఘవేంద్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో పీజీఆర్(గ్రీవెన్స్‌డే) నిర్వహించారు. డివిజన్ నలుమూలల నుంచి మొత్తం 53 మంది వివిధ సమస్యలతో అర్జీలు అందజేశారు. బి.కొత్తకోట మండలం కోటావూరు గ్రామం వద్ద ఇనుప విద్యుత్ స్థంబాలు తుప్పు పట్టిపోయాయని, వాటిని తొలగించి, సిమెంటు స్థంబాలు ఏర్పాటు చేయాలని బిల్లూరువారిపల్లె యర్రమరెడ్డి విన్నవించారు. తమ అన్నదమ్ములకు వారసత్వ రీత్యా వచ్చిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని మదనపల్లె సీటీఎం గ్రామానికి చెందిన సిరాజున్నీసా అర్జీ ఇచ్చారు. తన ఇంటికి ఒకే డోర్ నెంబర్ వున్నా మదనపల్లె మున్సిపాలిటీ వారు రెండు ఇంటి పన్నులు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారని, ఒక పన్ను చెల్లించినా, రెండోది కూడా చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారని రామారావుకాలనికి చెందిన వృద్ధురాలు నాగమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తనకు హౌసింగ్ స్థలం చూపించి, లోను కూడా ఇచ్చారని ఆలోనుతో ఇంటి నిర్మాణం చేపట్టినా, ఏళ్ల గడుస్తున్నా స్థలానికి పట్టా ఇవ్వలేదని వాల్మీకిపురం మండలం బర్నేపల్లెకు చెందిన అరుణ వినతి పత్రం అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా మండలాల అధికారులకు రెఫర్ చేయడంతో పాటు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఏవో పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.